# నినాదం
నిఖార్సైన జర్నలిజం

# సాహితీ లహరి

ఆదివారం 12-04-2026




# సాహసోపేత ఆవిష్కరణ

**కళాత్మక సత్యాన్ని ఆవిష్కరించే ఆత్మకథ 05-04-2026 వ్యాసానికి స్పందన**

**కళాత్మక సత్యాన్ని ఆవిష్కరించే ఆత్మకథ**
తప్పు కాదు..
తన మూలాలను వెతుక్కోవడం!
అక్షరం సాక్షిగా
తన అస్తిత్వాన్ని చాటుకోవడం
నేరం అంతకన్నా కాదు!
**ఎటొచ్చీ...** అనుభవించిన అవమానాలను అణచిపెట్టి
నిజాలను దాచిపెట్టి
ముసుగు వేసుకోవడమే అసలైన తప్పు!
సాధారణంగా...జీవితం చరమాంకానికి చేరాక
జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రాస్తారు ఆత్మకథలు.
**కానీ...**ఐదు పదుల ప్రాయంలోనే
తన ప్రయాణాన్ని పదిలపరుస్తూ
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు
చేసిన ఈ రచన ఒక 'సాహసోపేత ఆవిష్కరణ'.
ఇది కేవలం... ఒక వ్యక్తి గడిచిన కాలం కాదు,
ఒక సమూహం పడ్డ వేదన..
దేశవ్యాప్త దళిత జీవితాల నిలువుటద్దం!
ఎక్కడ చూసినా... దళిత సమస్యల మూలాలు ఒకటే!
వివక్షను ఎండగట్టడం కంటే
ఆ జీవితాన్ని ఒక విశిష్ట కోణంలో దర్శింపజేయడం,
కులాన్ని ఒక అవమానంగా కాక
జీవితంలో ఒక అంతర్భాగంగా చూపిస్తూ
సాగిపోయిన శైలి.. అద్భుతం!
వచనంలో సాగుతూనే
కవిత్వపు పరిమళాన్ని వెదజల్లే
ఒక అక్షర సత్యం ఈ గ్రంథం.
గ్రామీణ నేపథ్యం... సామాజిక స్పృహ...
పల్లెటూరి మట్టిలో
కనిపించని కుల వివక్ష గీతలు,
సామాజిక అంతరాల గాయాలు
ఈ రచనలో పచ్చిగా కనిపిస్తాయి.
ముఖ్యంగా... శ్రమజీవుల కష్టాలు
వ్యవస్థలోని లోపాలను
తన అనుభవాల కంచె దాటించి ప్రతి వాక్యంలో ఒక
సామాజిక సత్యాన్ని నిక్షిప్తం చేశారు.
కుటుంబం అంటే... కేవలం రక్త సంబంధం కాదు,
కష్టాల్లో తోడు నిలిచే ఒక ధైర్యం!
తన తండ్రి పట్ల గల గౌరవం,
ఆయన పడ్డ శ్రమ,
ఆ ఆర్థిక ఇబ్బందులు... కేవలం దార్ల గారివి కావు,
అవి ఒక తరపు సామాజిక చిత్రపటాలు.
అక్షరం నేర్పిన సంస్కారం... విద్యే ఏకైక మార్గమని
నమ్మి, పేదరికం అనే చీకటి నుండి
జ్ఞానమనే వెలుగు వైపు
బాల్యంలో మొదలైన అక్షరాభ్యాసం
ఉన్నత చదువుల శిఖరం చేరే వరకు
ఎదురైన అడ్డంకులు ఎన్నో!
వినయం నేర్పిన గురువులు,
నేస్తంలా మారిన పుస్తకాలు,
గ్రంథాలయాల సావాసం...ఆయన్ని ఒక మేధావిగా
మలిచిన వైనం స్ఫూర్తిదాయకం.
ఆత్మగౌరవ పోరాటం...దళిత జీవితాల్లో
ఆత్మగౌరవం అనేది ఒక విలాసం కాదు,
అది ఒక ప్రాణవాయువు. చిన్నచూపును ఎదుర్కొని,
సొంత గుర్తింపును సంపాదించుకోవడంలో
చూపిన పట్టుదల వృత్తిరీత్యా సాంప్రదాయాల నుండి
ఆధునిక విద్య వైపు మళ్లిన చారిత్రక పరిణామం!
ఈ ఆత్మకథ... గతకాలపు జ్ఞాపకాల మూట మాత్రమే
కాదు, రాబోయే తరాలకు ఒక దిశానిర్దేశం.
మనిషి పుట్టుకతో వచ్చే కులం కంటే
కృషితో సంపాదించుకునే విద్యే గొప్పదని
చాటిచెప్పే ఒక నిశబ్ద విప్లవం!
అక్షరం...కేవలం ఒక గుర్తు కాదు,
అది ఒక ఆయుధం! వ్యక్తిగత ఎదుగుదల
సామాజిక చైతన్యంతో ముడిపడినప్పుడు
ఆత్మకథ... ఒక జాతి చరిత్రగా మారుతుంది.
తొలి అడుగులు... సాహిత్య ప్రస్థానం!
విద్యార్థి దశలోనే సమాజంలోని అసమానతలను చూసి
కలత చెందిన హృదయం, వాటిని అక్షరబద్ధం
చేయాలని తపించిన వైనం. వచనపు లోతుల్లో
అప్పుడప్పుడు మెరిసే కవితా పంక్తులు
రచయితలోని సున్నితమైన భావజాలాన్ని,
సామాజిక వేదనను ఆవిష్కరిస్తాయి.
దళిత సాహిత్యం...
ఒక ప్రత్యేక ముద్ర!
ఈ రంగంలోకి ప్రవేశించడం అంటే
కేవలం రాయడం కాదు, అణచివేతకు గురైన
గొంతుకలకు ప్రతినిధిగా నిలబడటం.
దార్ల గారు తన శ్రమతో, పరిశోధనతో
దళిత సాహిత్య వినీలాకాశంలో తనకంటూ ఒక సుస్థిర
స్థానాన్ని నిర్మించుకున్నారు.
కుల వివక్ష... ఒక చేదు నిజం!
ఎన్ని చదువులు చదివినా, ఎంతటి ఉన్నత పదవుల్లో
ఉన్నా... సమాజపు కళ్ళల్లో కులం పొరలు
ఇంకా తొలగిపోలేదన్న సత్యం నిప్పులాంటిది.
"కులమనేది ఒక వ్యక్తి సమస్య కాదు,
అది ఒక వ్యవస్థాగతమైన లోపం" అని
ఆయన రాసిన నిర్మొహమాటపు మాటలు
పాఠకుడిని లోతుగా ఆలోచింపజేస్తాయి.
విద్యాలయాల సాక్షిగా... హైదరాబాద్ సెంట్రల్
యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాంగణాల్లో
విద్యను అభ్యసించే క్రమంలో... ఒకవైపు జ్ఞాన
సముపార్జన, మరోవైపు అణచివేతపై సామాజిక
స్పృహ! అట్టడుగు వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు
ఒక స్థాయికి చేరుకోవడానికి పడే మానసిక
సంఘర్షణకు ఈ రచన అద్దం పడుతుంది.
వృత్తి జీవితం...సవాళ్లు – విజయాలు!
అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా
ఉన్నత విద్యా రంగంలో అడుగుపెట్టినప్పుడు
అక్కడ ఎదురైన అంతర్గత రాజకీయాలు,
అదృశ్యంగా సాగే కుల వివక్షను
ఎంతో ధైర్యంగా విశ్లేషించారు.
పరిశోధన పటిమతో దళిత, బహుజన సాహిత్యానికి
ఆయన అందించిన కొత్త దిశానిర్దేశం అమోఘం.
మానవీయ విలువలే... అసలైన గమ్యం!
ఈ ఆత్మకథ కేవలం గతకాలపు గాయాలనే కాదు,
భవిష్యత్తుకు కావాల్సిన మానవీయ విలువలను
బలంగా బోధిస్తుంది. కులమతాలకు అతీతంగా
మానవత్వాన్ని ప్రేమించడం, అక్షరం ద్వారా
సమాజంలో మార్పు తీసుకురావడం
ఆయన జీవిత సందేశం.
ముగింపుగా...
"కళాత్మక సత్యాన్ని ఆవిష్కరించే ఆత్మకథ"
కేవలం దార్ల గారి ప్రయాణం మాత్రమే కాదు...
అది అణచివేతకు వ్యతిరేకంగా అక్షరం చేసిన యుద్ధం!
తెలుగు సాహిత్య చరిత్రలో ఇది ఒక మైలురాయి,
రాబోయే తరాలకు ఒక గొప్ప స్ఫూర్తి!


బి. రామకృష్ణ రెడ్డి
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఫోన్: 7382546949




## మణిపూసలు


పోయిందా నీ పరువు
బ్రతకడమే ఇక బరువు
సమాజాన నిలవలేక
నీకు నీవే నచ్చవు!

గతమెవ్వరు మార్చలేరు
నిన్ను చూసి జాలిపడరు
లేది మళ్ళీ పరిగెడితే
నిన్నెవ్వరు ఆపలేరు!

గ్రంథాలను చదవచ్చు
పురాణాలు చదవచ్చు
ఉత్తమంగా బ్రతుకుటకు
నీతికథలు చదవచ్చు!

- కె ఆనంద్

**తెలుగు సాహిత్య ప్రపంచంలో సంప్రదాయ సంకెళ్లను తెంచుతూ, ఆలోచనల్లో విప్లవంసృష్టించిన అరుదైన రచయిత గుడిపాటి వెంకటాచలం. 1894 మే 18న మద్రాసులో జన్మించిన ఆయన, 'చలం'గా ప్రసిద్ధులయ్యారు. స్త్రీలు ఎదుర్కొనే సామాజిక, మానసిక సమస్యలను, వారి అంతరంగాన్ని ఇంత నిక్కచ్చిగా ఆవిష్కరించిన రచయిత మరొకరు లేరు. స్త్రీ కేవలం కుటుంబ పరిధులకే పరిమితం కాకూడదని, ఆమెకు తన దేహంపై, మనసుపై పూర్తి స్వేచ్ఛ ఉండాలని ఆయన బలంగా ఆకాంక్షించారు. చలం రచనలు శైలిలో సరళంగా ఉన్నా, భావాల్లో అత్యంత శక్తివంతంగా ఉంటాయి. ఆయన రాసిన 'మైదానం', 'శశిరేఖ', 'దైవమిచ్చిన భార్య' వంటి నవలలు, 'చలం ఉత్తరాలు', 'మ్యూజింగ్స్' వంటి వ్యాస సంకలనాలు తెలుగు సాహిత్యంలో మైలురాళ్లుగా నిలిచాయి. సమాజం ఆయనను 'విప్లవకారి'గా చూసినా, ఆయన మాత్రం నిరంతరం సత్యం కోసం, మనుషుల మధ్య సహజమైన ప్రేమ కోసం అన్వేషించారు. జీవితం చివరి దశలో రమణ మహర్షి బోధనలకు ఆకర్షితులై అరుణాచలంలో స్థిరపడిన చలం, 1979లో కన్నుమూసినా నేటికీ ఆధునిక సామాజిక మార్పులకు, స్త్రీవాద సాహిత్యానికి ఆయనే స్ఫూర్తిప్రదాత.**



## సాయి సాహిత్య ముచ్చట్లు

# నిశ్శబ్దాన్ని ఛేదించిన... నిప్పుకణిక మైదానం

తెలుగు సాహిత్యం అంటే ఒకప్పుడు కేవలం పురాణాలు, ప్రబంధాలు లేదా పద్ధతైన కుటుంబ గాథలు మాత్రమే అనే భావన ఉండేది. ఆ నిశ్శబ్ద వాతావరణంలోకి ఒక నిప్పుకణికలా వచ్చి పడింది. 1927లో గుడిపాటి వెంకటాచలం రాసిన 'మైదానం' నవల. అప్పట్లో ఒక సంచలనం, నేటికీ ఒక చర్చనీయాంశం. తెలుగు సాహిత్యం అంతా ఒక ఎత్తైతే 'మైదానం' నవల ఒక ఎత్తు. ఇది కేవలం ఒక కథ కాదు, ఒక సామాజిక సిద్ధాంతం, ఒక తిరుగుబాటు బావుటా, అంతకు మించి స్త్రీ హృదయ ఆవిష్కరణ.

సంప్రదాయ వివాహ వ్యవస్థను, స్త్రీ అణచివేతను ప్రశ్నిస్తూ చలం రాసిన ఈ నవల, సాహిత్య ప్రపంచంలో ఒక పెద్ద విస్ఫోటనాన్ని సృష్టించింది. ఒక స్త్రీ తన మనసులోని ఆశలను, ఆకాంక్షలను స్వేచ్ఛగా ప్రకటించడమే పాపంగా భావించే కాలంలో, ఆమె తన శరీరానికి, మనసుకి తానే యజమాని అని చాటి చెప్పిన నవల మైదానం. మనం చలం శైలి రచనా వైదుష్యం గమనించినట్లైతే అత్యంత పదునైనదిగా కనిపిస్తుంది. ఆయన వాక్యాలు సూటిగా పాఠకుల గుండెలకు తాకుతాయి. స్త్రీ మనోభావాలను వర్ణించడంలో ఆయన చూపిన చాకచక్యం అసాధారణం. రాజేశ్వరి అంతర్మథనాన్ని, ఆమె పొందే ఆవేదనను, ఆనందాన్ని పాఠకుడు అనుభూతి చెందేలా నవలను రచించడంలో చలం సఫలమయ్యారు.

ఆయన ఈ నవలకు 'మైదానం' అనే పేరు పెట్టడం వెనుక గొప్ప అంతరార్థం దాగి ఉన్నది. నాలుగు గోడల మధ్య బందీగా ఉన్నటువంటి స్త్రీ, ఒక విశాలమైన మైదానంలోకి అడుగు పెట్టినప్పుడు పొందే అనుభూతి ఏమిటి? అక్కడ సరిహద్దులు లేవు, సమాజపు కట్టుబాట్లు లేవు. కేవలం ప్రకృతి, మనిషి మాత్రమే మిగిలి ఉంటారు. ఆ స్వేచ్ఛలో ఉన్న అనంతమైన ఆనందాన్ని, దాని వెనుక ఉన్న ఎలాంటి అలోచనలు, చింతలు లేనటువంటి జీవితాన్ని చలం అద్భుతంగా చిత్రించారు.

రాజేశ్వరి ఒక ఉన్నత మధ్యతరగతి గృహిణి. ఆమె భర్త లాయర్. సమాజం దృష్టిలో ఆమెది ఒక సుఖవంతమైన జీవితం. కానీ, ఆ నాలుగు గోడల మధ్య ఆమె మనసు బందీ అయిపోతుంది. భర్త శారీరక, మానసిక అవసరాల మధ్య ఆమె ఉనికి కనుమరుగవుతుంది. ఈ క్రమంలో ఆమెకు అమీర్ పరిచయమవుతాడు. అమీర్ ఆమెను ఒక యంత్రంలా కాకుండా, ఒక మనిషిగా, ఒక అందమైన కళాఖండంలా ప్రేమిస్తాడు. సమాజపు కట్టుబాట్లను, కన్నబిడ్డను, కట్టుకున్న భర్తను వదిలి రాజేశ్వరి అమీర్‌తో కలిసి 'మైదానం' (విశాలమైన ప్రపంచం)లోకి అడుగుపెడుతుంది. అక్కడ ఆమె పొందిన అనుభూతులు, ఎదుర్కొన్న సవాళ్లే ఈ నవల.

ఈ నవలలో అత్యంత ధైర్యవంతమైన పాత్ర రాజేశ్వరి. ఆమె తీసుకున్న నిర్ణయం తప్పు కావచ్చు, ఒప్పు కావచ్చు.. కానీ అది ఆమె సొంత నిర్ణయం. ఆత్మవంచన చేసుకోకుండా బ్రతకాలనుకునే ప్రతి స్త్రీకి ఆమె ఒక ప్రతిరూపం. చలం అమీర్ పాత్రను చాలా సున్నితంగా మలిచారు. అమీర్ కేవలం ఒక ప్రేమికుడు మాత్రమే కాదు, స్త్రీలోని అసలైన సౌందర్యాన్ని ఆరాధించే ఒక తాత్వికుడు. నవలలో పాత్రల రూపంలోనే కాకుండా, అదృశ్యంగా సమాజం ఒక పెద్ద విలన్‌గా కనిపిస్తుంది. రాజేశ్వరిని వెలివేయడం ద్వారా సమాజం తన సంకుచితత్వాన్ని బయటపెట్టుకుంటుంది. తెలుగు సాహిత్య ప్రపంచంలో గ్రాంథిక భాషా సంకెళ్లను తెంచుతూ, వాడుక భాషా విప్లవానికి చలం 'మైదానం' ద్వారా ఊపిరి పోశారు. పండిత శబ్దాల కంటే సామాన్యుడి గుండె చప్పుడే శక్తివంతమైనదని నమ్మిన చలం, అత్యంత సరళమైన, సూటియైన వాక్యాలతో పాఠకుడిని ఉలిక్కిపడేలా చేశారు. ఆయన శైలిలో ఒక రకమైన 'నిశితమైన పదును' కనిపిస్తుంది; పొదుపుగా వాడే పదాల్లోనే కొండంత భావాన్ని, ఆవేశాన్ని నింపి, సామాజిక కట్టుబాట్లపై అక్షరాయుధాలను సంధించారు. స్త్రీ మనోభావాలను, శారీరక ఆకాంక్షలను ఎక్కడా దాగుడుమూతలు లేకుండా 'పచ్చిగా' ఆవిష్కరించడం చలం ప్రత్యేకత. "నిజాయితీ లేని సంప్రదాయం కంటే, నిక్కచ్చిగా ఉండే తిరుగుబాటు మిన్న" అని చాటిన ఆయన శైలి, ఆధునిక తెలుగు వచన రచనకు ఒక దిక్సూచిగా నిలిచింది. అది కేవలం ఒక రచన కాదు, పాఠకుడి అంతరాత్మను తట్టిలేపే ఒక భావజాల ప్రకంపన.

**ఆధునిక కాలంలో 'మైదానం' ఆవశ్యకత...**

నేడు మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. స్త్రీలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. కానీ, మానసిక స్వేచ్ఛ విషయంలో నేటికీ ఎక్కడో ఒకచోట 'రాజేశ్వరి'లు నలిగిపోతూనే ఉన్నారు. గృహ హింస, మానసిక వేధింపుల మధ్య మగ్గిపోయే మహిళలకు 'మైదానం' ఒక ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. అయితే, చలం కేవలం స్వేచ్ఛను మాత్రమే కాకుండా, ఆ స్వేచ్ఛ వెనుక ఉండే బాధ్యతను, అభద్రతను కూడా నవల ముగింపులో చూపిం చారు. ఇది పాఠకులకు ఒక హెచ్చరిక కూడా.

చలం రాసిన 'మైదానం' నవలలోని స్త్రీ లైంగిక స్వేచ్ఛను కేవలం శారీరక వాంఛగా కాకుండా, స్త్రీ తన శరీరం, మనసుపై పూర్తి అధికారాన్ని ప్రకటించుకోవడంగా అర్థం చేసుకోవాలి. అప్పటిదాకా సమాజం, సంప్రదాయం విధించిన గృహ బంధనాలను, విలువల ముసుగులో జరిగే అణచివేతను ఎదిరించి, తన భావాలకు అనుగుణంగా జీవించడమే ఇందులోని ప్రధానాంశం. కథానాయిక రాజేశ్వరి తన ఇష్టాయిష్టాలకు విలువే లేని వైవాహిక జీవితాన్ని వదిలి, అమీర్‌తో కలిసి వెళ్లడం అనేది ఆనాటి సామాజిక కట్టుబాట్లపై ఒక తిరుగుబాటు. చలం దృష్టిలో లైంగికత అనేది అపరాధం కాదు, అది ఒక సహజాతమని, దానిని అణచివేయడం వల్లనే మానసిక రుగ్మతలు వస్తాయని ఆయన వాదిస్తారు. 'మైదానం'లో స్వేచ్ఛ అంటే పితృస్వామ్య వ్యవస్థ నిర్దేశించిన 'పతివ్రతా' ఇమేజ్ నుండి బయటపడి, తన ఆనందాన్ని స్వయంగా వెతుక్కునే వ్యక్తిగత స్వేచ్ఛ. మైదానం' నవలపై ఎన్ని విమర్శలు వచ్చినా నేటికీ దానిలో ప్రతిపాదించిన స్వేచ్ఛపై చర్చలు జరుగుతునే ఉన్నాయి. దీనికి కారణం, తెలుగు సాహిత్యంలో స్త్రీవాదానికి, హేతుబద్ధమైన ఆలోచనలకు పునాది వేసిన రచన గా మిగిలిపోయింది.


డి. సాయినాథ్ రెడ్డి
6305584064






## సత్యం వైపు!

**మనిషి మరో మనిషిని చంపడం**
**ఆటవికమే కాదు అధర్మం కూడా !**
**కర్మ నుంచి ఎవరు తప్పించుకోలేరు!**
**కొంచెం ఆలస్యం అయితే అవ్వచ్చు గాక! శిక్ష మాత్రం పక్కా!**

కొంచెం సమయం మించి పోయిందనే మిషతో
షాపులోని వ్యక్తిని లాక్కొచ్చి చితక్కొట్టడం
అడగడానికి వచ్చిన కొడుకుపై
రౌడీయిజం చేయడం ఏం ధర్మం?
వ్యక్తిగత కక్షలు ఏమీ లేకపోయినా
అధికార దర్పాన్ని ప్రదర్శించడం
ఎక్కడ జీవిస్తున్నాం మనం?
బుద్ధుడు పుట్టిన దేశంలో

అహింసా పరమో ధర్మః అని ఘోషించిన
వేద భూమిపై హింసకు తావేలేదు!
కొందరు భ్రాష్టులు మాత్రం 'ధర్మ హింసా తథైవ చ' అని
ప్రచారం చేస్తే ఫలితం ఇలాగే ఉంటుంది!
సుదీర్ఘ పోరాటం తర్వాత సత్యం గెలిచింది!
సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ధర్మం కాపాడబడింది!
'రేవతి' న్యాయదేవతగా వెలసి సత్య ధర్మాలు
బ్రతికే ఉన్నాయని రుజువు చేసింది!

ఉరిశిక్షలు సమర్థనీయం కాదు గాని
ఇప్పటికైనా పశ్చాత్తాపం లేకపోతే అనుసరణీయమే!
నీరు పల్లమెరగడం సత్యం నిజాన్ని
రేవతి కాపాడడం అంతకంటే సత్యం!
శభాష్ రేవతి! నిన్ను చూసి న్యాయ దేవత మురిసిపోతుంది!
నిన్ను చూసి భారతజాతి పొంగిపోతుంది!?

**(తమిళనాడులో ఇటీవల లాకప్ డెత్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పును చూసి)**


డా. గూటం స్వామి
9441092870




# డిజిటల్ యుగంలో మారుతున్న సంబంధాలు

## వివాహిత మహిళలు డేటింగ్ యాప్‌ల వైపు మళ్లడం ఒక విశ్లేషణ

ఇటీవల జరిగిన times of india సర్వే ప్రకారం, భారత్‌లో వివాహిత మహిళలు డేటింగ్ యాప్‌ల వినియోగం 148% పెరిగిందని వెల్లడైంది. ఈ సమాచారం సమాజంలో ఆందోళనకు కారణమైనప్పటికీ, ఇది కేవలం నైతిక సమస్య మాత్రమే కాదు ఇది మన సంబంధాల రూపంలో జరుగుతున్న లోతైన మానసిక, సామాజిక మార్పులను సూచిస్తుంది. మానసిక శాస్త్ర దృష్టిలో చూసినప్పుడు, ఈ ధోరణి వెనుక ప్రధాన కారణాలు భావోద్వేగ లోపం, సంబంధాల్లో అసంతృప్తి, గుర్తింపు (validation) అవసరం. పరిశోధనలు చూపుతున్నాయికి సంబంధంలో భావోద్వేగ అనుబంధం తగ్గిపోతే, వ్యక్తులు బయట సంబంధాలను వెతుకుతారు. భారతదేశంలో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, 40% వివాహితులు డిజిటల్ అఫైర్స్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు, అంటే వారు ఆన్‌లైన్ ద్వారా భావోద్వేగ సంబంధాలు పెంచుకుంటున్నారు.
డేటింగ్ యాప్‌లు అందుబాటులో ఉండటం వల్ల "ఇతర ప్రత్యామ్నాయాలు" (alternatives) ఎక్కువగా కనిపిస్తున్నాయి. సంబంధాల మానసిక శాస్త్రంలో ఇది ఒక ముఖ్యమైన అంశం ఎక్కువ



ఎంపికలు ఉన్నప్పుడు, వ్యక్తులు తమ ప్రస్తుత సంబంధాన్ని తక్కువగా విలువ చేయడం ప్రారంభిస్తారు. పాశ్చాత్య దేశాల్లో కూడా సుమారు 10% మంది సంబంధంలో ఉన్నప్పటికీ డేటింగ్ యాప్‌లను ఉపయోగిస్తున్నారు, అంటే ఇది ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ధోరణి. సమాజంలో మహిళల స్వతంత్రత, ఆర్థిక స్వయం సమృద్ధి పెరగడం వల్ల, వివాహంపై ఉన్న అంచనాలు కూడా మారుతున్నాయి. IPSOS 2025 సర్వే ప్రకారం, పురుషులు (43%) మరియు మహిళలు (42%) మధ్య అవిశ్వాసం (infidelity) దాదాపు సమానంగా ఉంది, ఇది లింగపరమైన మార్పును సూచిస్తుంది. పాశ్చాత్య పరిశోధనలు కూడా చెబుతున్నాయి కి అవిశ్వాసం పెరిగిందని కాదు, కానీ టెక్నాలజీ కారణంగా అది ఎక్కువగా కనిపిస్తోంది.

**సమాజం కుటుంబాలు ఏమి చేయాలి?**
మొదటగా, ఈ సమస్య టెక్నాలజీ వల్ల కాదు– సంబంధాల్లో భావోద్వేగ దూరం వల్ల. కాబట్టి, కుటుంబాలు భావోద్వేగ అవగాహన పెంచాలి. రెండవది, దాంపత్యంలో స్పష్టమైన సంభాషణ, పరస్పర గౌరవం, సమయం కేటాయించడం చాలా ముఖ్యం. మూడవది, డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ప్రవర్తనపై స్పష్టమైన హద్దులు పెట్టుకోవాలి. చివరగా, విలువలు మారాలి కానీ మాయమవ్వకూడదు. నిబద్ధత, సహానుభూతి, బాధ్యత ఆధునిక సంబంధాల మూలస్తంభాలు కావాలి. మొత్తంగా చూస్తే, ఈ ధోరణి కుటుంబ వ్యవస్థలు కూలిపోతున్నాయని కాదు–ప్రేమ, సంబంధాలపై అంచనాలు మారుతున్నాయని సూచించే ఒక హెచ్చరిక సంకేతం. ఈ మార్పులను అర్థం చేసుకొని, సంబంధాలను బలోపేతం చేస్తే, ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థలను మళ్లీ నిర్మించవచ్చు.


డా. కడారి దేవరాజు,
మానసిక సలహాదారు
(సైకాలజికల్ కౌన్సిలర్)




# అమ్మ నడిపించింది... మృత్యువు ఒడికి!

మనసు లేని మన సమాజానికి ఇదో మూగ ప్రశ్న! సమాజం దృష్టిలో అదొక పరిపూర్ణమైన కుటుంబం. ఉన్నతమైన ఉద్యోగం, చేతినిండా సంపాదన, అంతకుమించిన సామాజిక హోదా... కానీ ఆ 'వెలుగు' వెనుక ఎంతటి చిమ్మచీకటి దాగి ఉందో ఆ ముగ్గురు ప్రాణాలు గాలిలో కలిసాకే ప్రపంచానికి తెలిసింది. సాఫ్ట్‌వేర్ రంగంలో టీమ్ లీడర్‌గా ఎంతోమందికి దిశానిర్దేశం చేసిన విజయశాంతి, చివరికి తన జీవిత నావను తానే ముంచేసుకోవడం ఒక విషాదం అయితే... తాను కడుపున మోసి, చనుబాలిచ్చి పెంచిన బిడ్డలను కూడా తనతో పాటే మృత్యువు వైపు నడిపించడం గుండెలు **పగిలేంతటి ఘోరం...** విజయశాంతి సామాన్య మహిళ కాదు, విద్యావంతురాలు. ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ లీడర్. ఆమె కింద ఎంతోమంది పనిచేస్తున్నారు. భర్త దుబాయ్‌లో మంచి ఉద్యోగంలో స్థిరపడ్డారు. భార్యాభర్తల మధ్య గొడవలూ లేవు, ఆర్థిక ఇబ్బందులూ లేవు. పిల్లలిద్దరూ (కుమార్తె ఇంటర్ సెకండ్ ఇయర్, కుమారుడు ఇంటర్ ఫస్ట్ ఇయర్) ప్రయోజకులవుతారని ఆశించే వయసు. కానీ, ఆ తల్లి మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. పిల్లలిద్దరినీ కారులో ఎక్కించుకుని చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లి, పార్కింగ్ స్లిప్ వెనుక... "అమ్మా సారీ.. నాకు ఈ లైఫ్ నచ్చలేదు. బతకడానికి చాలా ట్రై చేశాను... కానీ నా వల్ల కావట్లేదు. నా పిల్లల్ని వదిలేసి నేను పోలేను... అందుకే వాళ్ళని కూడా తీసుకుపోతున్నా..." అని రాసి, తన పేగుబంధాన్ని తానే తెంచేసుకుంది.
ఇక్కడ మనల్ని కలచివేస్తున్న అంశం ఒక్కటే... పదిహేడేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకున్న బిడ్డల్ని, ఆ తల్లి తన చేతులతో మృత్యువు ఒడికి ఎలా చేర్చగలిగింది? అసలు ఆ పిల్లలు తల్లి నిర్ణయానికి ఎలా తలొగ్గారు? "పదండి చనిపోదాం" అని తల్లి పిలవగానే, మారు మాట్లాడకుండా ఆ పిల్లలు ఆమె చేయి పట్టుకుని రైలు పట్టాల వైపు ఎలా నడిచారు? బహుశా... ఆ తల్లి పడుతున్న మానసిక క్షోభను ఆ పిల్లలు అర్థం చేసుకున్నారేమో! "అమ్మ లేకపోతే మనకు బతుకు లేదు" అని భావించి ఉంటారేమో! ఆ దృశ్యాన్ని ఊహించుకుంటేనే గుండె బరువెక్కుతోంది. నవమాసాలు మోసిన తల్లే యముడిగా మారేంతటి "నిర్వేదం" ఆమెను ఎంతలా ఆవహించి ఉందో కదా! మనం మనుషులం అనుకుంటున్నాం కానీ, యంత్రాలకంటే దారుణంగా మారిపోయాం. పక్కవాడి జేబులో డబ్బు ఉందా లేదా అని చూస్తున్నామే తప్ప, వాడి గుండెలో బరువును కొలిచే పరికరాలు మన దగ్గర లేవు. ద పైకి నవ్వుతూ కనిపించే ముఖాల వెనుక, ఆత్మహత్య చేసుకునేంతటి ఆవేదన దాగి ఉంటోంది. నిత్యం జరిగే అవమానాలు, పని ఒత్తిడి, చెప్పుకోలేని ఒంటరితనం... ఇవన్నీ మనిషిని లోపలి నుంచి తినేస్తున్నాయి.
**మనసు విప్పి మాట్లాడేదెవరు?** ఈ ఘటన మనకొక గుణపాఠం. "నాకెందుకులే" అనే నిర్లిప్తత వద్దు. మన పక్కన ఉన్న మనిషి కళ్ళలోకి చూద్దాం. వారి మౌనాన్ని అర్థం చేసుకుందాం. "నేనున్నాను" అనే ఒక్క మాట, ఒక్క ఓదార్పు స్పర్శ... బహుశా మూడు ప్రాణాలను కాపాడేదేమో! విజయశాంతి తన బాధను ఎవరితోనైనా పంచుకుని ఉంటే, లేదా ఆమె ఆవేదనను ఎవరైనా గుర్తించి ఉంటే... ఈ రోజు ఆ ఇద్దరు పిల్లల భవిష్యత్తు ఇలా రైలు చక్రాల కింద నలిగిపోయేది కాదేమో!
**బంగారు భవిష్యత్తు ఉన్న ఆ పిల్లల ఉసురు, ఆ తల్లి ఆత్మహత్య...** మన సమాజం మీద పడిన మాయని మచ్చ. ఇప్పటికైనా మేల్కొందాం. మన చుట్టూ ఉన్నవారికి "మనిషి"గా స్పందిద్దాం. ఆస్తులు, అంతస్తులు కాదు... ఆప్యాయతలే మనిషిని బతికిస్తాయని గుర్తిద్దాం. ఎందుకంటే... ప్రాణం పోయాక కన్నీళ్లు పెట్టడం కాదు, ప్రాణంతో ఉన్నప్పుడు కన్నీళ్లు తుడవడమే నిజమైన మానవత్వం!


డా. బండారు
విజయ్ కుమార్




# నినాదం
నిఖార్సైన జర్నలిజం

# సాహితీ లహరి

ఆదివారం 12-04-2026




## కాశీ క్షేత్రం...



సీ.
కైలాస నాథుడు కాశీ పురమునకు
వచ్చి పోవుచునుండు పగలు రాత్రి
బ్రహ్మదేవుని సృష్టి ప్రళయకాలమునందు
విధ్వంసమైనను వింతగాను
దీప నగరి నిల్చి దేదీప్య కాంతులన్
వెదజల్లుచుండును విశ్వమంత
రుద్రుడీ క్షేత్రమున్ రుధిరమౌ జ్వాలలన్
ప్రసరింప నీయక పట్టినిలుపు

తే.గీ.
ఇట్టి నగర మీ గోళాన నెచట గలదు
కనుల వత్తినిడి కనిన కాంచలేము
సకల భక్త మోక్షప్రద స్థావరమ్ము
శివ కృపాలబ్ద వరము కాశీపురమ్ము.




జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001
8106384812


## మానవత్వమే మన మట్టి తత్వం..!!

మానవత్వం వెలగని మతమెందుకు?
సోదరభావం పంచని కులమెందుకు?
చరిత్ర పుటల నిండా రక్తపు మరకలే మిగిలేచో..
వర్ణాలన్నీ వర్ణించలేని శూన్యమవ్వడమే మేలు!
సృష్టి సంతకం ఏకత్వమే కదా..
ప్రకృతి తత్వంలో ఈ భిన్నత్వపు చిచ్చులెందుకు?
ఏ ప్రాణికి లేని భేదాలు మనకెందుకు?
జ్ఞానపు మెరుపులు మెరిసినా వీడని అజ్ఞానమిదేనా?
ఆదిలో ఆకలి తీర్చుకోవడమే పరమార్థం,
మధ్యలో భూభాగాలకై సాగినది వినాశనం!
నేడు పదవుల పందెంలో విద్వేష వాణిజ్యం
కులమతాల జోడు గుర్రాల్లో సామాన్యుడు దాసోహం.
ప్రతి తనువులో ప్రవహించేది ఎర్రని రక్తమే కదా!
పుట్టుకకు ముందే నీకు తెలియదు నీ వర్ణం..
మట్టిలో కలిశాక వెంటరాదు ఏదీ ఇది నగ్న సత్యం!
మధ్యలో ఎందుకీ బేరసారాల బతుకు చిత్రం?
కొమ్మపై పక్షి కిలకిలారావాలతో అరుస్తుంటే
నేలపై మృగం స్వేచ్ఛగా చిందులేస్తుంటే
ప్రతి జీవి తన సహజత్వపు ఒడ్డున నవ్వుతుంటే
మనిషి మాత్రం స్వయంకృత రొంపిలో మౌనరోధనం..
నీరు నిప్పులది వివక్ష లేని కౌగిలి
నింగి నేలది నిరంతర జీవయాగం
నిర్మలమైన గాలి నీ వెన్నంటే పయనిస్తుంది,
పంచభూతాలే నీకై నిత్యం తపిస్తుంటాయి!
కాలం ఎన్నడూ చూపలేదు పక్షపాతం,
ప్రకృతి ఎవరికీ కాలేదు వ్యక్తిగత సొత్తు..
కానీ మనకు మనమే శత్రువులమై మసలుతున్నాం,
లోక కళ్యాణం మరచి హింసనే ధర్మంగా బతుకుతున్నాం!


కొప్పుల ప్రసాద్,
నంద్యాల
9885066235




సీ.క్షీర పయోధిజ! కమనీయ! లక్ష్మీ ప
తి! కరుణాక్షవదన! కిసోర!
పింగళ మంధార పుష్పవర్ణా రమా
రమణా! భువన పాల రక్షకాయ!
శేషశయన! సుంధరేశ్వర! మధుసూధ
నా! భక్త లోల మనోప్రతిష్ఠ
ఇష్టదేవ! రమేశ !ఈశ్వరారాధన
ప్రిమ! పంకజవల్లభా కిసోర!!

తే.గీ. మోహన మనోహర నమన పల్లవేశ!
గోపికాప్రియ! నందన కమల చెక్షు
చెన్నకేశవ! చతురాస్య జనక జైత్ర!
మమ్ము కరుణించి దయచూపవే జితేంద్ర!


-కోట. విజయ్ కుమార్,
హైదరాబాద్ కేంద్రీయ శ్వవిద్యాలయం


## సాహిత్య చరిత్ర ఉద్యమ పరిచయం

**ఒకజాతి వైశిష్ట్యాన్ని సంస్కృతిని అక్షర బద్ధం చేస్తే అది సాహిత్యమవుతుంది. హితాన్ని కలిగి ఉండేదే సాహిత్యం అన్నది పాత నిర్వచనం. హితాహితాలతో సంబంధం లేకుండా జాతి సాంస్కృతిక విశేషాలను వివరించి, భవిష్యత్తరాల వారికి అందించేది సాహిత్యం. ఇప్పటివరకు కవుల్నీ, పోషకులన్నీ కాలక్రమాన్ని అనుసరించి కూర్చుకుంటూ తీసుకొచ్చినటువంటి సాహిత్యాన్ని చరిత్ర అన్నారు అంటున్నారు. కూడా. కానీ సాహిత్య చరిత్ర అనేది సాహిత్యం ఎలా సామాజిక జీవితం మీద ప్రభావం చూపిందో అర్థం చేసుకోవడానికి సహాయకారి కావాలి.**

ఒక భాషా వర్గం సృష్టించుకున్న సృజనాత్మక రచనల సమాహారం సాహిత్యమైతే, కాలానుగుణంగా ఆ రచనలలో ఏర్పడిన భావావేశాల మార్పు, దానికి గల కారణాలను వివరించేది సాహిత్య చరిత్ర. ఒక జాతి సృజనాత్మక రచనల ప్రారంభ కాలం నుంచి ఇప్పటిదాకా పొందిన వైవిధ్యం సాహిత్య చరిత్రకు సామాగ్రి అవుతుంది. ఆ రచనలు చేపట్టిన ఉద్యమాన్ని సామాజిక దృక్కోణంలో ఏర్పడ్డ కాలానుగత మార్పును కథనం చేసేదే. సాహిత్య చరిత్ర అంటే కేవలం ఆంగ్ల పదమైన హిస్టరీకి సమానార్థకం కాదు. చరిత్ర అంటే గతి, నడక, ఒక వ్యక్తి లేదా సమాజ స్వభావం అని అర్థం. సమాజ స్వభావం తెలియాలంటే ఉద్యమాల పుట్టుక పరిణామం కూడా తెలియాలి.

చరిత్ర అనేది కాలక్రమంలో ఒక అంశం పొందే వికాసాన్ని చెప్పేదే అయినా, ప్రతి రోజూ, ప్రతి అంశం ముఖ్యం కాదు. ఆ అంశం నడిచే తీరులో మలుపులు సృష్టించేటటువంటి కీలకాంశాలూ, రచనలూ, వ్యక్తులూ, భావజాలాలు ముఖ్యస్థానం వహిస్తాయి. ఇవన్నీ విడివిడిగా కనిపించినప్పటికీ ఒకానొక కాలఘట్టంలో ఏర్పడే భావ పరిణామంలో భాగాలవుతాయి. ఈ పరిణామాన్ని తెచ్చే దశనే భావ పరిణామ స్థితి అంటాం. ఆ దశనే ఉద్యమం అంటాం. అది కాలం సృష్టించే ఒక కదలిక. కాల కదలికలో కలిగే మలుపే ఉద్యమమని చెప్పవచ్చు.

చరిత్ర మానవ జీవన పరిణామంలో ఏర్పడే ఘట్టాలన్నింటినీ నమోదు చేస్తుంది. అయితే, ప్రతి సంఘటనా చారిత్రక ఘట్టం కాలేదు. ప్రతి వ్యక్తి చారిత్రక పురుషుడు కాలేడు. ప్రతీ రచనా సాహిత్య గతిని మార్చేదిగా ఉండదు. అలాంటప్పుడు ఆ భావజాలంలో ఏర్పడ్డ మార్పు ఎప్పుడైతే ఒక మలుపును ఏర్పరుస్తుందో అప్పుడది ఉద్యమ స్ఫూర్తిని పొందుతుంది. ఉద్యమాలన్నీ కూడా సాధారణంగా భావావేశపు స్థితికి ప్రతీకలవుతాయి. వ్యక్తిగత భావావేశం హృదయ స్పందన అయితే, ఒక జాతిని ప్రేరేపితం చేసే భావావేశం ఉద్యమ రూపం దాలుస్తుంది. కానీ, ఏ ఉద్యమం కలకాలం నిలువదు. ఆయా కాలన్నీ అనుసరించి, ఏర్పడే భావ ప్రేరణ ఆకాలానికే పరిమితమవుతుంది. ఆ స్ఫూర్తి ఎన్నాళ్ళు ఉంటుంది అంటే, సామాజికంగా మరొక ఆవశ్యకత ఏర్పడి, ఒక కొత్త భావజాలం జాతిని సమూలంగా మార్చినప్పుడు మరో కొత్త ఉద్యమం పుడుతుంది. అది ఒక స్పష్టమైన కాలఘట్టం ఒక స్పష్టమైన సామాజిక నిర్దిష్టత అందులో ఉంటుంది. ఒక జాతి చరిత్రలో ఎన్నో వేదనల గాథలు దాగి ఉంటాయి. ఆవేదనలు ప్రచలిత రూపం పొంది, ఎన్నో ఉద్యమాలకు కారణం కావచ్చు. ఒక చరిత్ర వేదనా ప్రసవం, ఉద్యమం అనే మాటలకు వివరణ ఇవ్వాలంటే, చరిత్రలో మానవ సమాజ వేదన అంతర్లీనంగా నినదిస్తూనే ఉంటుంది. కాలాన్ననుసరించి అది వర్ణ, వర్గ భేదాలు కావచ్చు. లింగ, ప్రాంతీయ భేదాలు కావచ్చు. అటువంటి భేదాలు రచయితల రచనల్లో ప్రతిపాదించక మానవు. Man is social animal అన్న మాట అక్షర సత్యం. వ్యక్తిగత అనుభవాల్ని దాటి, సామాజిక స్థితిగతులు సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. భారతీయ సాహిత్యాన్నే ఉదాహరణగా తీసుకుంటే చారిత్రక నేపథ్యాన్ని ప్రతి ఫలిస్తూ వచ్చిన మార్పులెన్నో. తొలినాటి భారతీయ సాహిత్యం ప్రాకృతికమైందే. ప్రాకృత భాషలో విలువడ్డదే అయి ఉండాలి. ప్రాకృత భాష సుసంస్కృతమై వైదిక సాహిత్యంగా వెలువడి ఉంటుంది. మళ్ళీ బౌద్ధం, జైనాలు వేళ్లూనిన తర్వాత ప్రాకృతం మళ్లీ ఒక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ దశలో మార్పు వైదిక సంస్కృతికీ,బౌద్ధ, జైన మత ప్రభావానికీ సుస్పష్టమైన ఉదాహరణలు. వైదిక సాహిత్యం రూపు దాల్చటానికి ముందే ఆ సంస్కృతి సముచిత స్థానాన్ని పొంది ఉండాలి. అందువల్లనే ఆ రచనలు వెలువడ్డాయి. దానికి భిన్నమైన మరొక సంస్కృతి తలెత్తి, అహింస, సామాజిక సమతలు దాని ప్రధాన వాహికలైనపుడు వేరొక సంస్కృతి రూపుదాల్చింది. ఇవన్నీ వివిధ ఉద్యమాల ప్రతీకలే. తెలుగు సాహిత్యాన్ని దీనిని ఆధారంగా తీసుకుంటే తెలుగు సాహిత్యంలోని పలు యుగాలు ఉద్యమ ప్రతీకలన్నది స్పష్టమవుతుంది. సాహిత్యం ఉద్యమం రెండూ ఒకదానికొకటి తోడు. ఉద్యమం సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుంది. సాహిత్యం ఉద్యమాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. సాహిత్యం ఉద్యమం నుండి ఊపిరి తీసుకుంటుంది. బదులుగా వివిధ రూపాల్లో ఉద్యమ వ్యాప్తికి ఊపిరి పోస్తుంది. ఉద్యమం సమాజంలో రూపుదిద్దుకుని, చైతన్యవంతమై వివిధ దశలోకి ఎగబాకి, ఎందరినో ప్రభావితం చేసి, ఏ కవి ఎదనో తడుతుంది. లేదా, ఆ ఉద్యమంలో ఆసక్తి ఉన్న వాళ్ళలో ఎవరికో కవితాస్ఫూర్తి కలుగుతుంది. అప్పుడు ఉద్యమం కవిత్వం లోకి ప్రవేశిస్తుంది. ఏ ఉద్యమమైన సాహిత్యంలో ప్రవేశించే తొలినాళ్లల్లో సాహిత్యం ఒక వాహిక అవుతుంది. అదే, వాహిక కాస్తా ఎదిగి ఎదిగి పలుగురు రచనల్ని ప్రభావితం చేసి,ఆదిశలో పలు రచనలు వెలువడగానే అది సాహిత్యోద్యమంగా రూపుదిద్దుకుంటుంది.

ఏదైనా తయారయ్యే దాకా దాని ప్రత్యక్ష లక్షణాలంటూ ఏవీ తయారు కావు.అయితే ఒక పరిపూర్ణమైన లక్షణం తయారు కాగానే దాని లక్షణాలు గుర్తించడం సుసాధ్యం అవుతుంది.


సమాజంలో ఆవిర్భవించే ఉద్యమాలకు స్పష్టమైన భావజాలం ఉంటుంది. భావజాలమంటే నిర్ణీతమైనటువంటి నిర్మాణాన్ని నిర్దేశించే తీరే, నిర్మాణానికి సంబంధించిన సూత్రాల తాత్త్వికత. నిర్ణీతమైన నిర్మాణాన్ని సూత్రీకరించే తాత్త్వికతల సమాహారం, దాంట్లో భావజాలంలో దిశానిర్దేశం ఉండాలి. స్వచ్ఛంద ప్రేరణ(Self automation), ఆత్మచలనం (Dynamic philosophy) కలగాలి. మార్గాలు, లక్ష్యాలు, అనుసరించే విధానాలు అనుక్రమాలు, దాని దశ గురించిన ఊహలు చాలా స్పష్టంగా ఉండాలి. ఉద్యమాలన్నీ, అన్ని కాలాల్లోనూ ఒకటిగానే ఉండవు. కాలాన్ని, భావజాలాన్ని బట్టి ఉద్యమంలో మార్పులు ఉంటాయి. ఉద్యమాలు ముఖ్యంగా ప్రాంతీయ ఉద్యమాలనీ, సామాజిక వర్గ ఉద్యమాలనీ చెప్పవచ్చు. ప్రాంతీయ ఉద్యమాలకు ఉదాహరణ సీమ, తెలంగాణ ఉద్యమాలు. సామాజిక వర్గ ఉద్యమాలకు ఉదాహరణగా స్త్రీవాదం, దళితవాదం మైనారిటీ వాద కవిత్వాలు చెప్పుకోవచ్చు. ఈ వర్గీకరణ ఆధునిక సాహిత్యానికి సరిపోవచ్చు. కానీ, పూర్వ యుగ సాహిత్యంలో ఇటువంటి వర్గీకరణ సరిపోదు. అక్కడ కనిపించే ఉద్యమాలన్నీ సామాజిక ధోరణులే అయినా, అవి వివిధ దశలకూ, భావజాలాలకు ఉదాహరణ ప్రాయంగా నిలిచాయి.

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే ఇలాంటి ఉద్యమాలు ప్రతి యుగంలోనూ కనిపిస్తాయి. నిజానికి, యుగల న్నీ కూడా ఒక ఉద్యమ స్ఫూర్తిని కలిగించిన కవినో, రచనా రీతినో ఆధారం చేసుకుని చేయబడ్డవే అనవచ్చు. ఆ భావజాలం నిర్ణయించిన తీరు వల్లే నిర్మాణంలో మార్పురావటం. నన్నయతో ప్రారంభమైన తెలుగు కవిత్వోద్యమం వచనంతో సరికొత్త మలుపు తిరిగిందని చెప్పవచ్చు. ఈ వెయ్యేండ్ల తెలుగు సాహిత్యం పోయిన పలు పోకడలు పలు ఉద్యమాలకు, కొత్త కొత్త భావజాలానికీ ప్రతీకలే.




ఆచార్య భూక్య తిరుపతి
తెలుగుశాఖ
హైదరాబాద్
విశ్వవిద్యాలయం
సెల్ : 9441335123


## ఆచార్య దార్ల నెమలికన్నులకు...
# పురస్కారం





**హైదరాబాద్, (నినాదం):** హెచ్‌సియు తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు 2023లో రచించిన ఆత్మకథ 'నెమలికన్నులు' గ్రంథానికి శరత్ సాహితీ కళాస్రవంతి (కరీంనగర్) సబ్బని నాగమ్మ-మల్లేశం సాహితీ పురస్కారం -2025 ప్రకటించారు. ఈనెల మూడవ వారంలో జరిగే సంస్థ వార్షికోత్సవం, కరీంనగర్‌లో జరిగే సభలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి పదివేల నూట పదహారు రూపాయల నగదు, జ్ఞాపికలతో సత్కరిస్తారని ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సబ్బని లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సంకేపల్లి నాగేంద్ర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నెమలికన్నులు తన ఆత్మకథలు మొదటి భాగమనీ, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ ఆత్మకథ రాశానని ఆచార్య దార్ల చెప్పారు. సుమారు ఇరవైఐదు సంవత్సరాల బోధనానుభవంతో పాటు, సుమారు 24 గ్రంథాలను రచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, గుర్రం జాషువా జాతీయ పురస్కారాలు వంటివి ఆయన గతంలో అందుకున్నారు. ఆయన రచనలు వివిధ విశ్వవిద్యాలయాలలో రిఫరెన్స్ పుస్తకాలుగా పాఠ్యాంశాలుగా ఉన్నాయి. ఈ పురస్కారం రావడం పట్ల అధ్యాపకులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

## నా మదిలో మెదిలే చెలి

నిన్ను చూసిన క్షణం మదిలో మొదలైన
ప్రేమ ప్రయాణం నీ దరి చేరేవరకు
ఆగనంటుంది నా ఊహల ప్రపంచం
నా కనులు చూసిన నీ ముఖ అరవిందం నా
తనువు చాలించే వరకు శాశ్వతంగా
నిలిచిపోయే ఓ మధుర జ్ఞాపకం
నా మనసులో ఎన్నో ఆలోచనలు ఉన్నా నీకై
చేసే ప్రేమ ఆలోచనలు అనంతం చెప్పలేని
ఓ అద్భుతం
నా జీవితానికి దూరమైన నీ పరిచయం
మళ్లీ ఎప్పుడు పలకరిస్తావని అవధులేని నా
మది ఆరాటం
నేను ఒంటరిగా ఉన్న ప్రతి గడియ నీ
జ్ఞాపకమై నా మదికి చేస్తున్న ఓ తీయని
గాయం
నా జీవితకాలంతోపాటు మర్చిపోతానులే
అనుకున్నా కానీ నా జీవితం అనే కాలంలో
చిరస్థాయిగా నిలిచిపోయే ప్రేమ కానుకని
గుర్తించలేకపోయా
నా మది ఎన్నో సంఘర్షణాల కెరటం
అందులో నీ ప్రేమ తాలూకా సంఘర్షణలే
అనేకం ఆ సంఘర్షణల ప్రతిరూపమే ఈ
కవిత్వం
నీ ప్రేమ అనే కడలిలో మునిగిన నా
మనసుకు తెలియని ఎన్నో విషయాలను
నేర్పిన కార్యశాల అయింది మన ప్రేమగతం
నా కనులు ఎన్ని అందాలు చూసినా ఎన్ని
పరిచయాలు నన్ను పలకరించిన నీ అందం
గురించి నా మనసులో జనించే ప్రతి
అక్షరం ఏదో చెప్పాలని ఆరాటపడుతుందనే
నా సంతోషం
నా నుండి నువ్వు దూరమైన నీ పలకరింపు
నాకు కరువైన నీ జ్ఞాపకాలతో నా జీవిత
ప్రయాణం సాగుతుందనేది సత్యం
నీ ప్రేమ పొందలేకున్నా నిరంతరం నీ
సంతోషాన్ని మనస్ఫూర్తిగా కోరుకునే ఓ
ఆశాజీవికి సంకేతం నా జీవితం
నీ అందం చూసి నా కనులు మరవకుండా
మురిసిపోయే రూపం నీ సొంతం
నీ మాటలు నాకు నేను గుర్తుచేసుకొని
చిరునవ్వులతో సాగిపోయే నేస్తం




వంశీకృష్ణ గౌడ్ బండి
రంగయ్యపల్లి, రేగొండ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9550837962


## వెయ్యి మణిపూసలులో.. కొన్ని...


బడి పలుకులు వద్దన్నడు
పలుకుబడులు ముద్దన్నడు
సహజమైన తెలంగాణ
భాష మనకు హద్దన్నడు!
(మహా కవి కాళోజీ)

అంతరాత్మ పలికినట్లు
అణువుగుండె పేలినట్లు
కవిత్వ మనిపించాలి
అమృతంప్రవహించినట్లు!
("కవిత్వమనిపించాలి")

తెలంగాణ ప్రాంతమందు
"కవులు లేరు" మాటలెందు
సరికావని "సురవరం"
చేసినట్టి పని పసందు!
(సురవరం మనవరం)

'పూలలోన చేరినావు
చైతన్యము నింపినావు
తెలంగాణ కోవెలలో
బతుకమ్మె వెలిసినావు!"?

ఉషోదయపు కిరణమతడు
తెలంగాణ వీరుడతడు
మహాకవి దాశరథి
సాహిత్యపు శక్తి యతడు!
(కవి సింహం)




## వారసత్వం-తెనుగు వాడి నీరసత్వం

*శర్విలకుడు చారుదత్తుడి ఇంటికి కన్నం అందంగా వేసి వుండవచ్చు. తన సొమ్ము పోయినా, కనుల పండువైన ఈ తూటు దీటైనదని, చతుఃషష్టి కళల్లో ఇదీ ఒకటని చారుదు (ఆయనకు జారులు, చోరులు కూడా కళాకారులే!) చోరుని మెచ్చుకునీ వుండొచ్చు. కానీ చివరకి అది దొంగతనమే! స్వారస్యమున్నా సారాంశమదే. అటీవల వచ్చిన ఓ తమిళ చిత్రం 7th Sense (ఏళాం అరివు) అన్న తమిళ చిత్రంలో చైనాలో మార్షల్ ఆర్ట్స్– ముఖ్యంగా 'కుంగ్ ఫూ' ప్రవేశపెట్టిన వాడు, శావొలిన్ గురుకుల పద్ధతిని ప్రవేశ పెట్టిన వాడు బోధి దమ్మన్ అనే "తమిళ" పల్లవ యువరాజు అని పలుమార్లు 'గుండెలు బాదుకుంటారు(thumping the chestకు ఇది సరియైన అనువాదం కాదు –'ఛాతీ చరుచుకుంటారు' అని వ్రాస్తే సబబుగా వుంటుందని తెలుసు). ఈ సుప్రసిద్ధ దర్శకునికి చరిత్ర తెలియక కాదు. అదో వ్యాపారపు టక్కు (commercial gimmick).*

**పల్లవులు తమిళు లెప్పుడయ్యారు?
పచ్చి అబద్ధం. అసలు వీరెవరు?**


పలు సిద్ధాంతాలున్నా, ప్రస్తుతానికి చాలావరకు చరిత్ర కారులంగీకరించినది పర్షియా నుండి పరిక్రమించి పల్నాటిని పాలించి తెనుగు దనాన్ని పూత పూసుకుని, పరాక్రమంతో దక్షిణాదికి విస్తరించి, పరిపాలనా సౌలభ్యం కోసం కాంచీ పురాని(కంచి)కి రాజధానిని మార్చి, తదుపరి మహాబలిపురం కట్టించిన కళా పిపాసులు అని.కల్కి కృష్ణమూర్తి రచించిన "శివగామియిన్ శబథం"లో కూడా పల్లవరాజులలో మొదటివాడైన మహేంద్రవర్మ ది కూడా ఒక ముఖ్య పాత్ర. ఇంకా కొన్ని ఏళ్ళ ముందు ఏ. కాశీలింగం దర్శకత్వం వహించి, 'పురచ్చి నడిగర్' నటించిన 1963నాటి "కాంచీ తలైవన్" (నంది నరసింహ వర్మ) చిత్రంలో తమిళ దేశాన్నికూడా పాలించిన పల్లవులను నేర్పుగా తమిళ ప్రభువులుగా చూపించారు. వారు ఐతేగియితే ద్రమిళులు లేదా తెనుగు వాళ్ళు, లేదా పహ్లావులు. అంతేకాని ఆ చిత్రాల్లో చూపినట్టు తమిళు లైతే ముమ్మాటికీ కాదు. ద్రావిడ సోదరీమణులలో ముమ్మాటికీ పెద్దక్క తమిళమే. కాని చెల్లెల్లది – ఎవరి స్థానం వారిది; ఎవరి గౌరవం వారిది. ఎవరి చరిత్ర వారిది. దాన్ని కళగ (kazhaga) పులగం చేయడం భావ్యం కాదు. అంతెందుకు, నిన్నగాక మొన్న చైనా ప్రీమియర్ ఛి పిన్ కు ప్రధాని మోది మహాబలిపురంలో అతిథి మర్యాదలు సలిపినప్పుడు తమిళు పత్రికలు, టీవీ ఛానెల్లే కాక నేషనల్ మీడియా సైతం మహాబలిపురపు పల్లవుల తమిళ వారసత్వాన్ని, సంప్రదాయాన్ని, నాగరికతను కథలు,కథలుగా పేర్కొన్నాయ్. ఇంత వరకూ ఇంకా అక్కడ వేరూరని, ఎలాగైనా అరవలను బుట్టలో వేసుకోవాలని ప్రయత్నిస్తున్న భాజప సరేసరి... తందానా తానా. అయ్యా! మరి కులాల ముసుగులో పనికిమాలిన విషయాలపై గంటలు, గంటలు (పేజీలు,పేజీలు) ప్రతినిత్యం కలహించే మన కులాల దన్నున్న తెలుగు మీడియా ఏం చేసింది? దన్నుంది గానీ, దమ్ము...లేదే. పక్కవాడు మన వారసత్వాన్ని తనదని జంభాలు పలికి జబ్బలు చరుస్తుంటే , తల త్రిప్పుకు తప్పుకునే చవటలం. గాంధీ అనే ఓ చెట్టుక్రింది ప్లీడర్ తెలుగు కు "క్లాసిక్" భాషా పట్టం కట్టొద్దని తమిళనాడు హైకోర్టులో వ్యాజ్యం వేసినప్పుడు కూడా మన వారి వైఖరి అంతే. తెలుగుకు ఆ హోదా వస్తే ఇతరులకు తరిగేదేమీ లేదే!? మరెందుకు వారికీ అసూయ. మరి మనకెందుకు ఇంతటి పిరికితనం. అలా అని తమిళులంతా ఇలాంటి వారే అని అనుకోవడం అంతకంటే తప్పు. "మా తెలుగు తల్లికి.." కవితా రచయితవి కూడా తమిళ మూలాలే. అంతెందుకు ఆయనే చెప్పుకున్నట్టు మహాకవి శ్రీశ్రీ పూర్వీకులు కూడా వలస వచ్చినవారే. ఎటొచ్చీ మూకుమ్మడి దొంగలింపు మందలింపు కర్వమే. ఇక వర్తమానాని కొస్తే, కీర్తి శేషులు కల్కి కృష్ణమూర్తి (ఈయనే రచించిన "శివగామియిన్ శబథం"లో కూడా పల్లవరాజులలో మొదటివాడైన మహేంద్రవర్మ ది కూడా ఒక ముఖ్యపాత్ర అని చదివాను) రచించిన కల్పిత చారిత్రాత్మక గాథ (ఇవేవో మన రాజమౌళి పలుకుల్లాగున్నాయే!) ఆధారంగా 3–4 ఏళ్ళ క్రిందట విడుదలయిన ఓ చిత్రపు తెలుగు వక్కాణింపు పలు ప్రమోషన్ ఈవెంట్స్ (సినిమా)లో కూడా అందరూ ఇది 'తమిళు'ల వీరగాథ, "తమిళ చోళు"ల విజయగాథ అని పదే పదే నొక్కి వొక్కాణించడం 'నిండా' బాధ గా వున్నిందప్పా? నెంజు ఒలికిదు.ఎన్నా పంద్రుదు. ఒరు పొయ్యే నూర్ వాట్టు సొన్నా, అదే ఉన్మై ఆయిడుమే!

**ఇక చరిత్ర కొద్దాం. అసలు చోళులు తమిళులా?**

చోళ వంశపు మూలపురుషుడు కరికాళ చోళుడు, కాళహస్తి సమీపం లోని 'ఇంగానల్లూరు' వాడని, ఆయన గురించిన సమాచారమేదైనా తెలుగు ప్రాంతాల్లో దొరికిందే గాని, తమిళనాడు లో వీసమెత్తైనా దొరకలేదని ఆరుద్ర గారు తమ "సమగ్ర ఆంధ్ర సాహిత్యం"లో సశాస్త్రీయంగా పేర్కొంటారు. తరువాతి కాలంలో రాజరాజ చోళుడు కుందవ్వ, తూర్పు చాళుక్యుడైన విమలాదిత్యున్ని పెళ్ళాడడానికి అంగీకరించడానికి, బహుశా, తమ మూలాలు ముఖ్యమైన కారణమైవుండవచ్చు. ఆ మూలాల మీది మక్కువకు మరో ప్రబల నిదర్శనం – పిలిచి చాళుక్యుడైన కుందవ్వ ముని మనుమడు రాజేంద్రునికి కులోత్తుంగ చోళునిగా పట్టం కట్టడం, ఆతడు చోళ సామ్రాజ్యాన్ని మరింత విస్తరింప జేయడం చరిత్ర కారులెరిగినదే. అంతేకాదు, రేనాటి (నేటి రాయలసీమలో కొంత) ప్రాంతాన్ని పరిపాలించిన పాలకులు తమను తాము రేనాటి చోళులుగా ప్రకటించుకోవడం కూడా, చోళుల తెలుగు మూలాలను బలోపేతం చేస్తాయ్. ఔను తరువాతి కాలంలో చోళులు పరిపాలించిన ఎక్కువ భూభాగం తమిళం మాట్లాడేదే. అంతమాత్రాన చోళులు పూర్తిగా శుద్ధమైన తమిళులు కాలేరు. ఇదే తర్కం పల్లవుల ("కాంచీ తలైవన్"లో నరసింహ వర్మ రేనాటి చోళ కుమారితో ప్రేమలో పడతాడు) కు కూడా అన్వయిస్తుంది. వీరందరినీ రాజీ భావంతో బహుశా "ద్రమిళులు"( ద్రావిడులు) అనొచ్చేమో గాని, కేవలం తమిళులే అని ఢంకా బజాయించలేం. మరింత పరిశోధన, పరిశీలన అగత్యం. అంతవరకూ ఆ చారిత్రక నాయకుల వారసత్వాన్ని పూర్తిగా కబళించి వేయడం నిజమైన హక్కుదారులను కళ్ళున్నా కబోదులను చేయడమే.

**ఎందుకు ఈ అగ్గువ జిత్తులు. దీన్నేమనాలి??
వార సత్వమా? 'వార' సత్వమా??**

ఏళ్ళ తరబడి ఇంత అతిక్రమణ జరుగుతున్నా, కళ్ళూ చెవులే కాదు, సిగ్గూ శరం లేని మన నాయకులను, మీడియాను ఏమనాలి? ఇప్పుడే కాదు. ఎన్నో ఏళ్ళుగా నిజమైన మన హక్కులను, ఏటి పాలు చేసిన ఏలికల నాడి వేడి ఈనాడు మాడిపోయిందా? తెనుగు వాడి 'వాడి' వాడిపోయిందా?? సిగ్గు, సిగ్గు.




- ప్రతాప్ రాజులపల్లి

నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 12-04-2026

# బహుజన స్వరాలు

## మట్టి గళంతో పలికిస్తున్న...

డి. సాయినాథ్ రెడ్డి
6305584064

**మట్టి గళంతో బహుజన స్వరాల్ని పలికిస్తున్న డా. ఇడికోజు శ్రీనివాసచారి, డా. రామారావు గంజికుంట్ల లతో ముఖాముఖి. ప్రపంచీకరణ నేపథ్యంలో, సాహిత్యం కూడా వ్యాపారమయమైపోయి అట్టడుగు వర్గాల, కులాల, పీడితుల సాహిత్యం నిరాదరణకు గురవుతున్న తరుణంలో ఒక సంచలనంగా తెలుగు సాహిత్యంలో అట్టడుగు వర్గాల గళాన్ని వినిపిస్తూ, మౌఖిక సంప్రదాయంలోని జానపద విజ్ఞానాన్ని లిఖిత రూపంలోకి తీసుకువస్తున్నారు. ఆ గ్రంథాలకు సంపాదకులుగా వ్యవహరిస్తున్న డా. ఇడికోజు శ్రీనివాసాచారి, డా. రామారావు గంజికుంట్ల. ఇటీవల వీరిద్దరి సంపాదకత్వంలో 'మట్టి మాటలు' (జానపద సాహిత్యం), 'మట్టి పరమానందం' (జానపద సంస్కృతి), 'మట్టి తాళం' (జానపద కళలు), 'మట్టి వనం' (జానపద గిరిజన సాహిత్యం) వంటి విశిష్ట గ్రంథాలు వెలువడ్డాయి. వీటితోపాటు 'బహుంజన స్వరాలు' పేరుతో పరిశోధకులు, అధ్యాపకులు, ఆ రంగంలో విశేషమైన కృషి చేసిన రచయితలు , మేధావులపై పరిశోధన, విమర్శన వ్యాసాలు రాయించారు. అవి కూడా త్వరలో రాబోతున్నాయి. ఆ రంగాలలో విశేషమైన కృషి చేసిన వారి చేత ప్రతి పుస్తకానికి చక్కని ముందుమాటలు రాయించారు. వీరు కేవలం పుస్తక ప్రచురణకర్తలుగానే కాకుండా, ఒక సామాజిక-సాహిత్య ఉద్యమకారులుగా బహుజన దృక్పథాన్ని విద్యావంతులకు, సామాన్యులకు చేరవేస్తున్నారు. ఈ నేపథ్యంలో, జానపద, బహుజన సాహిత్యాల పరిరక్షణ, వాటి ప్రాముఖ్యత, భవిష్యత్తు ప్రణాళికల గురించి డా. ఇడికోజు శ్రీనివాస చారి గారితో 'నినాదం' దినపత్రిక 'సాహితీ లహరి' ప్రత్యేక ప్రతినిధి డి. సాయినాథ్ రెడ్డి జరిపిన ప్రత్యేక ముఖాముఖి...**

**నినాదం: ఈ మధ్యకాలంలో జానపద, బహుజన సాహిత్యంపై పుస్తకాలు తీసుకురావడంలో మీ లక్ష్యం ఏమిటి?**

జానపద సాహిత్యం, బహుజన సాహిత్యం అనేవి కేవలం సాహిత్య ప్రక్రియలు మాత్రమే కావు; అవి సమాజంలోని అణగారిన వర్గాల జీవన చరిత్రలు, అనుభవాలు, పోరాటాలు, సంస్కృతిని ప్రతిబింబించే జీవ పత్రాలు. కానీ చాలాకాలంగా ప్రధాన సాహిత్యం ఈ వర్గాలను అప్రాధాన్యంగా చూసిన నేపథ్యంలో, ఈరంగంలోని ఒకసమగ్రప్రయత్నం అవసరమైంది. ఈ నేపథ్యంలో మా లక్ష్యం మూడు ప్రధాన దిశల్లో ఉంది. మొదటిగా, స్వరహీనులకు స్వరం ఇవ్వడం. దళితులు, బీసీలు, గిరిజనులు, మైనార్టీలు, శ్రమజీవులు వంటి వర్గాల అనుభవాలను పుస్తకరూపంలో తీసుకురావడం ద్వారా వారి చరిత్రను లిఖితరూపంలో నిలబెట్టడం మా ప్రధాన ఉద్దేశ్యం. రెండవది, సంస్కృతిని సంరక్షించడం. జానపదం అనేది కేవలం పాటలు, కథలు మాత్రమే కాదు; అది ఒక సమాజపు విలువలు, విశ్వాసాలు, జీవన విధానాల సమాహారం. ఈ సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలంటే దానిని లిఖితరూపంలో భద్రపరచడం అవసరం. మూడవది, అకాడమిక్ స్థాయిలో ప్రాముఖ్యత కల్పించడం. మా పుస్తకాన్ని కేవలం భావోద్వేగ స్థాయిలో కాకుండా, పరిశోధనాత్మకంగా, విమర్శనాత్మకంగా అధ్యయనం చేసే విధంగా గ్రంథాలను తయారు చేయడం ద్వారా విద్యార్థులు, పరిశోధకులకు ఉపయోగపడేలా చేయడం మా లక్ష్యం. సారాంశంగా చెప్పాలంటే, ఇది కేవలం పుస్తక ప్రచురణ కాదు. సామాజిక చైతన్యాన్ని పెంపొందించే ఒక సాహిత్య ఉద్యమం.

**నినాదం: మీకు ఈ ఆలోచన ఎలా వచ్చింది?**

ఈ ఆలోచన ఒక్కసారిగా వచ్చినది కాదు; ఇది అనుభవం, అధ్యయనం, పరిశీలన, బాధ్యత కలిసి రూపుదిద్దుకున్న ఒక సాహిత్య దృక్పథం. జానపద, బహుజన సాహిత్యం బోధిస్తూ ఉండగా మూడు ముఖ్యమైన లోటులు స్పష్టంగా కనిపించాయి. మొదటిగా, సాహిత్య వనరుల విభజన సమస్య. పరిశోధకులు విలువైన వ్యాసాలు రాస్తున్నప్పటికీ, అవి చిన్న చిన్న పత్రికల్లో మాత్రమే పరిమితమవుతున్నాయి. ఒక విద్యార్థి పూర్తి అవగాహన పొందాలంటే అనేక వనరులు వెతకాల్సిన పరిస్థితి ఉంది. రెండవది, మౌఖిక సంప్రదాయం. జానపద, బహుజన అనుభవాలు ఎక్కువగా మౌఖికంగా మాత్రమే ఉండడం వల్ల, అవి లిఖితరూపంలోకి రాకపోతే కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇది ఒక బాధ్యత భావాన్ని కలిగించింది. మూడవది, అకాడమిక్‌లోటు. విశ్వవిద్యాలయాల్లో ఈ అంశాలకు ప్రాముఖ్యత పెరుగుతున్నప్పటికీ, సరైన రిఫరెన్స్ గ్రంథాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న తలెత్తింది: "ఇంత విస్తృతమైన జ్ఞానాన్ని ఒకే వేదికలో సమీకరించి అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ఎందుకు చేయకూడదు?" అదే ఈ సంకలనాల ఆవిర్భావానికి కారణమైంది. రచయితలను కలుపుకోవడం, వ్యాసాలను సేకరించడం, వాటిని క్రమబద్ధీకరించడం -ఇవి అన్నీ కలిసి ఒక సాధారణ సంపాదక ప్రక్రియగా కాకుండా, ఒక సామూహిక సాహిత్య యాత్రగా మారాయి. ఇది కేవలం ప్రచురణ కాదు; బహుజన వాదాన్ని బలపరచడం జానపద జ్ఞానాన్ని రక్షించడం కొత్త తరానికి విమర్శనాత్మక దృష్టి ఇవ్వడం అనే లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సామాజిక-సాహిత్య ఉద్యమంగా రూపుదిద్దుకుంది.సారాంశంగా చెప్పాలంటే, ఈ ఆలోచన ఒక అవసరం నుంచి పుట్టి, ఒక బాధ్యతగా మారి, చివరకు ఒక ఉద్యమంగా పరిణమించింది.

**నినాదం: పత్రికల కంటే పుస్తకంగా తీసుకురావడంలో ప్రత్యేకత ?**

పత్రికలు పుస్తకాలు రెండూ సాహిత్య ప్రసారానికి ముఖ్యమైన మాధ్యమాలే అయినప్పటికీ, వాటి ప్రభావం, నిలకడ, ఉపయోగం వంటి అంశాల్లో స్పష్టమైన తేడా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో పత్రికల కంటే పుస్తకంగా తీసుకురావడంలో ఉన్న ప్రత్యేకతను అర్థం చేసుకోవడం అవసరం. పత్రికలు సాధారణంగా తాత్కాలిక స్వభావం కలిగినవి. ఒక సంచిక వెలువడుతుంది, కొంతకాలం చర్చలో ఉంటుంది, తర్వాత కొత్త సంచికలతో పాటు అది మరుగునపడుతుంది. కానీ పుస్తకం మాత్రం శాశ్వతంగా నిలిచి, కాలంతో పాటు తన ప్రాముఖ్యతను కొనసాగిస్తుంది. ఒకసారి ప్రచురితమైన పుస్తకం, సంవత్సరాల తర్వాత కూడా అదే విలువతో పాఠకులకు ఉపయోగపడుతుంది. పుస్తకంగా తీసుకురావడంలో మరో ముఖ్యమైన అంశం సమగ్రత. పత్రికల్లో వ్యాసాలు విభిన్న అంశాలపై విడివిడిగా ఉంటాయి. కానీ పుస్తకం ఒక నిర్దిష్ట అంశాన్ని కేంద్రంగా తీసుకుని రూపొందించబడుతుంది. అందువల్ల ఒకే విషయంపై చరిత్ర, సిద్ధాంతం, విశ్లేషణ వంటి కోణాల్లో పూర్తి అవగాహన లభిస్తుంది. అదేవిధంగా, పుస్తకాలు పరిశోధకులకు స్థిరమైన రిఫరెన్స్ మెటీరియల్గా మారతాయి. గ్రంథాలయాలు, యూనివర్సిటీలలో ఇవి దీర్ఘకాలం నిల్వ ఉండి విద్యార్థులు, పరిశోధకులు నిరంతరం ఉపయోగించుకోగలుగుతారు. ఇది అకాడమిక్ ప్రపంచంలో పుస్తకాల ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. ఇంకా, పుస్తకాల్లో వ్యాసాలను ఒక క్రమబద్ధమైన నిర్మాణంలో అమర్చడం వల్ల పాఠకుడికి అధ్యయనం సులభమవుతుంది. ముందుమాట నుంచి విశ్లేషణాత్మక వ్యాసాల వరకూ ఒక సరైన ప్రవాహం ఉంటుంది. దీనికి తోడు సంపాదక పరిశీలన, సవరణల ద్వారా గ్రంథానికి ప్రామాణికత ఏర్పడుతుంది. సారాంశంగా చెప్పాలంటే, పత్రికలు ఆలోచనను పరిచయం చేస్తే, పుస్తకాలు ఆ ఆలోచనను స్థిరపరచి విస్తరింపజేస్తాయి.

**నినాదం: ప్రస్తుతం ఏమేం పుస్తకాలు వేశారు?**

ఇప్పటివరకు జానపద బహుజన సాహిత్య రంగాల్లో అనేక సంకలనాలను తీసుకువచ్చాం. ముఖ్యంగా జానపద సాహిత్యానికి సంబంధించిన "మట్టి మాటలు", "మట్టి పరిమళం", "మట్టి తాళం", "మట్టి వనం" వంటి గ్రంథాలు ప్రచురించాం. ఇవి భూమి, గ్రామీణ జీవితం, జానపద సంస్కృతి, ప్రజల అనుభవాలను ప్రతిబింబించే రచనల సమాహారం. అలాగే బహుజన దృక్పథాన్ని ప్రతిబింబించే "బహుజన గళం", "బహుజన స్వరం" వంటి గ్రంథాలు ఇప్పటికే వెలువడ్డాయి. ప్రస్తుతం "బహుజన ధ్వని", "బహుజన నాదం" వంటి సంకలనాలను కూడా తీసుకువస్తున్నాం. ఈ పుస్తకాలలో ప్రధానంగా: సామాజిక అసమానతలు కులవ్యవస్థపై విమర్శ జానపద సంస్కృతి మరియు సంప్రదాయాలు గిరిజనుల జీవన విధానం, పోరాటాలు వంటి అంశాలు విస్తృతంగా చర్చించబడ్డాయి. అందువల్ల, ఈ గ్రంథాలు కేవలం వ్యాసాల సంకలనాలు మాత్రమే కాకుండా, సమాజాన్ని లోతుగా అర్థం చేసుకునేలా మార్గనిర్దేశం చేసే విచార పథాలుగా నిలుస్తున్నాయి.

**నినాదం: భవిష్యత్తులో ఎలాంటి పుస్తకాలు వేయాలనుకుంటున్నారు?**

భవిష్యత్తులో మా ప్రచురణ ప్రణాళికలు మరింత విస్తృతంగా, లక్ష్యబద్ధంగా ఉన్నాయి. కేవలం సంకలనా లకే పరిమితం కాకుండా, పరిశోధనాత్మకత మరియు సామాజిక చైతన్యం కలిసేలా పుస్తకాలను రూపొందిం చాలను కుంటున్నాం.ముఖ్యంగా తులనాత్మక జానపద సాహిత్యం (తెలుగు-కన్నడ, తెలుగు-హిందీ వంటి భాషల మధ్య పోలికలు) ద్వారా భిన్న సంస్కృతుల మధ్య సంబంధాలను వెలికితీయడం మహిళా దృష్టికోణంలో బహుజన, గిరిజన సాహిత్యం ద్వారా మహిళల అనుభవాలు, సమస్యలు, స్వరాలను ముందుకు తీసుకురా వడం ఆధునిక సామాజిక ఉద్యమాలపై గ్రంథాలు (దళిత, బీసీ, గిరిజన ఉద్యమాలు) ద్వారా సమాజ మార్పు దిశను విశ్లేషించడం UGC NET, SET వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు రూపొందించి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవడం ఇవి కాకుండా, భవిష్యత్తులో మరింత లోతైన పరిశోధన గ్రంథాలు, విమర్శనాత్మక వ్యాస సంకలనాలు కూడా తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సాహిత్యం ద్వారా సమాజాన్ని అర్థం చేసుకోవడం మాత్రమే కాదు, సమాజంలో చైతన్యం కలిగించేలా పుస్తకాలను రూపొందించడం మా ప్రధాన లక్ష్యం.




**నినాదం: ఈ పుస్తకాలకు ఎలాంటి స్పందన లభిస్తుంది?**

ఈ పుస్తకాలకు ఆశించిన దానికంటే మెరుగైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మూడు స్థాయిల్లో ఆదరణ కనిపిస్తోంది. మొదటిగా, పరిశోధకులు, అకాడమిక్ వర్గం ఈ గ్రంథాలను రిఫరెన్స్ మెటీరియల్‌గా ఉపయోగిస్తున్నారు. ఒకే చోట సమగ్ర సమాచారం లభించడం వల్ల వారి పరిశోధనకు ఇవి ఉపయోగకరంగా మారుతున్నాయి. రెండవది, విద్యార్థుల స్పందన ఎంతో సానుకూలంగా ఉంది. భాష సరళంగా ఉండటం, అంశాలు స్పష్టంగా వివరించడం వల్ల సులభంగా అర్థమవుతున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా NET/SET వంటి పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఇవి ఉపయుక్తంగా ఉన్నాయి.(మూడవది, సాహితీవేత్తలు మరియు మేధావుల అభినందనలు లభిస్తున్నాయి. బహుజన, జానపద అంశాలను సమగ్రంగా తీసుకురావడం ఒక మంచి ప్రయత్నమని వారు పేర్కొంటున్నారు. ఇవి కాకుండా, సోషల్ మీడియా ద్వారా చర్చలు పెరగడం కూడా ఒక ముఖ్యమైన సూచన. పుస్తకాలపై సమీక్షలు, చర్చలు జరుగుతున్నాయి. ఇది పాఠకుల్లో ఆసక్తిని పెంచుతోంది.సారాంశంగా చెప్పాలంటే, ఈ గ్రంథాలు కేవలం చదివే పుస్తకాలుగా కాకుండా, చర్చలకు, పరిశోధనలకు, అవగాహనకు దారితీసే వేదికలుగా మారుతున్నాయి-అదే మాకు లభించిన గొప్ప స్పందన.

**నినాదం: AIఉపయోగించి రాసిన వ్యాసాలు కనిపించాయా?**

ప్రస్తుతం కృత్రిమ మేధ (AI) రచనా రంగంలో ఒక కొత్త మార్పును తీసుకువచ్చింది. దీనివల్ల రచనలు వేగంగా తయారవుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో వాటి స్వభావం స్పష్టంగా కనిపిస్తుంది. కొన్ని వ్యాసాలను పరిశీలించినప్పుడు. భావాల లోతు లేకుండా సాధారణంగా మాత్రమే వివరించడం ఒకే విధమైన వాక్య నిర్మాణం, పునరావృత శైలి వ్యక్తిగత అనుభవం, స్థానిక సందర్భం లేకపోవడం విమర్శనాత్మక దృష్టి కంటే సాధారణ సమాచారం ఎక్కువగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే, అవి AI సహాయంతో రాసినవిగా అనిపిస్తుంది. అటువంటి వ్యాసాలను ప్రచురణకు తిరస్కరించడం జరిగింది. అయితే, AI ఒక సాధనం మాత్రమే. కానీ సాహిత్యం విషయంలో ముఖ్యమైనది మానవ అనుభవం, భావోద్వేగం, సామాజిక అనుభూతి. ఇవి లేకపోతే రచన యాంత్రికంగా మారిపోతుంది. అందుకే మా దృష్టిలో, AI సహాయక సాధనం మాత్రమే కానీ సాహిత్యానికి ఆత్మ మాత్రం మనిషి అనుభవమే.

**నినాదం: వ్యాసాల ప్రామాణికతను ఎలా నిర్ణయిస్తారు?**

వ్యాసాల ప్రామాణికతను నిర్ణయించడం ఒక ముఖ్యమైన మరియు బాధ్యతాయుతమైన ప్రక్రియ. ఒక గ్రంథం నాణ్యత దానిలోని వ్యాసాల విశ్వసనీయతపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల ప్రతి వ్యాసాన్ని క్రమబద్ధంగా పరిశీలించడం అవసరం. మొదటిగా, రచయిత ఉపయోగించిన మూలాలు (=వటవతీవఅవెం) ఎంతవరకు ప్రామాణికమైనవో పరిశీలిస్తాం. తరువాత, అదే అంశంపై ఉన్న ఇతర రచనలతో పోల్చి కొత్త కోణం లేదా స్వతంత్రత ఉందా అనే విషయం గమనిస్తాం. అదేవిధంగా, ప్లేజరిజం చెక్ ద్వారా వ్యాసం ఒరిజినల్‌దేనా అని నిర్ధారిస్తాం. ఇవి మాత్రమే కాకుండా, వ్యాసంలో భావాల లోతు, విమర్శనాత్మక దృష్టి, భాషా స్పష్టత వంటి అంశాలను కూడా పరిశీలిస్తాం. ఈ విధంగా అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాత మాత్రమే ఒక వ్యాసాన్ని ఎంపిక చేస్తాం. సారాంశంగా చెప్పాలంటే, ప్రామాణికత అనేది మూలాలు, ఒరిజినాలిటీ, విశ్లేషణ, భాష -ఈ నాలుగు అంశాల సమన్వయంతో ఏర్పడే నాణ్యత ప్రమాణం.

**నినాదం: మీరు కేవలం సంకలనం చేస్తున్నారా? లేక సంపాదకత్వం వహిస్తున్నారా?**

మేము కేవలం వ్యాసాలను సేకరించి సంకలనం చేయడం మాత్రమే చేయడం లేదు. సంపూర్ణ సంపాదక బాధ్యతను కూడా సమగ్రంగా నిర్వహిస్తున్నాం. ఒక మంచి సంకలనం అనేది వ్యాసాల సమాహారం మాత్రమే కాకుండా, వాటిని ఒక నిర్దిష్ట దృక్పథంతో, నాణ్యతతో, క్రమబద్ధంగా రూపొందించడంలో ఉంది. ఈ ప్రక్రియలో ముందుగా ప్రతి వ్యాసాన్ని జాగ్రత్తగా చదివి, అవసరమైన చోట భాషా సవరణలు చేస్తాం. వాక్య నిర్మాణం, పదాల వినియోగం సరిచేసి, చదవడానికి సులభంగా ఉండేలా చూసుకుంటాం. తరువాత వ్యాసంలో సరైన ప్రవాహం ఉండేలా శైలి సరిచేయడం జరుగుతుంది, తద్వారా మొత్తం గ్రంథంలో ఒక సమగ్రత ఏర్పడుతుంది. అలాగే, పాఠకుడికి భావం స్పష్టంగా అర్థమయ్యేలా భావ స్పష్టత కోసం మార్పులు చేస్తాం. కొన్ని సందర్భాల్లో అంశాన్ని మరింత బలంగా వ్యక్తీకరించడానికి సూచనలు ఇస్తాం. ఈ దశలో అవసరమైతే రచయితలతో నేరుగా చర్చించి, వారి అభిప్రాయాలను గౌరవి స్తూ మార్పులు చేస్తాం. ఇవి మాత్రమే కాకుండా, మొత్తం సంకలనాన్ని ఒక క్రమబద్ధమైన నిర్మాణంలో అమర్చడం, ఒకే థీమ్‌కు అనుగుణంగా వ్యాసా లను ఏర్పరచడం కూడా సంపాదక బాధ్యతలో భాగమే. దీని ద్వారా పుస్తకం పాఠకుడికి సులభంగా అర్థమయ్యేలా, పరిశోధనకు ఉపయోగపడేలా మారు తుంది. సారాంశంగా చెప్పాలంటే, మా పని కేవలం సంకలనం కాదు; ప్రతి వ్యాసాన్ని మెరుగు పరచి, ఒక నాణ్యమైన, ప్రామాణిక గ్రంథంగా రూపుదిద్దే సంపాదక ప్రక్రియ.

**నినాదం: ఎదుర్కొన్న అనుభవాలు?**

సంకలన గ్రంథాల నిర్మాణంలో అనేక అనుభవాలు ఎదురయ్యాయి. ఈ ప్రక్రియ కేవలం వ్యాసాలను సేకరించడం మాత్రమే కాదు; వివిధ వ్యక్తులతో, వారి ఆలోచనలతో, అభిప్రాయాలతో కలిసి పనిచేసే ఒక సమగ్ర యాత్రగా మారింది.ముఖ్యంగా, కొందరు రచయితలు చేసిన సంపాదక మార్పులను అంగీకరించకపోవడం ఒక సవాలుగా మారింది. ప్రతి రచయిత తన రచనపై మక్కువ కలిగి ఉంటాడు కాబట్టి, మార్పులను స్వీకరించడం కొన్నిసార్లు కష్టమవుతుంది. అలాంటి సందర్భాల్లో చర్చలు జరిపి, పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లాల్సి వచ్చింది. అలాగే, సమయానికి వ్యాసాలు అందకపోవడం కూడా ఒక పెద్ద సమస్య. పుస్తకాన్ని నిర్దిష్ట సమయంలో పూర్తిచేయాలంటే, అందరి సహకారం అవసరం. కానీ కొన్నిసార్లు ఆలస్యాలు జరుగుతాయి, దీంతో ప్రణాళికలు మారాల్సి వస్తుంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం నాణ్యతను కాపాడటానికి కఠిన నిర్ణయాలు తీసుకోవడం. కొన్ని వ్యాసాలు అంశానికి అనుగుణంగా లేకపోవడం, లేదా ప్రామాణికత లోపించడం వల్ల వాటిని తిరస్కరించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇది కొంతమందికి నిరాశ కలిగించినప్పటికీ, గ్రంథ నాణ్యత కోసం అవసరమైన నిర్ణయం. ఈ అనుభవాలన్నీ ఒక విధంగా మాకు పాఠాలుగా మారాయి. ఇవి భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా, సమర్థంగా పని చేయడానికి దోహదపడుతున్నాయి. సారాంశంగా చెప్పాలంటే, సవాళ్లు ఉన్నప్పటికీ, అవే మాకు అనుభవాన్ని ఇచ్చి, మరింత మెరుగైన ప్రచురణల దిశగా నడిపించాయి.

**నినాదం: మౌలిక భావనలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారా?**

మౌలిక భావనలు ఏ రచనకైనా ప్రాణం. ముఖ్యంగా సంకలన గ్రంథాలలో ప్రతి వ్యాసం ప్రత్యేకతను కలిగి ఉండాలంటే, మౌలికతను కచ్చితంగా పరిరక్షించాలి. అందుకే ఈ విషయంలో మేము ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మొదటిగా, రచయితలను కొత్త ఆలోచనలు, కొత్త కోణాలు తీసుకురావడానికి ప్రోత్సహిస్తాం. ఒకే అంశాన్ని పునరావృతంగా చెప్పడం కాకుండా, దానిని విభిన్న దృక్పథాలతో విశ్లేషించాలనే దిశగా మార్గనిర్దేశం చేస్తాం. ఇది వ్యాసాల వైవిధ్యాన్ని పెంచుతుంది. రెండవది, సంకలనంలో పునరావృత అంశాలను తగ్గించడంపై దృష్టి పెడతాం. ఒకే భావం లేదా ఒకే ఉదాహరణలు పలు వ్యాసాల్లో రావకుండా చూసుకుంటాం. అవసరమైతే, వ్యాసాల ఎంపికలో లేదా క్రమబద్ధీకరణలో మార్పులు చేస్తాం. మూడవది, రచయితల్లో విమర్శనాత్మక దృష్టిని ప్రోత్సహించడం. కేవలం సమాచారం ఇవ్వడం కాకుండా, అంశాన్ని లోతుగా విశ్లేషించి, స్వంత అభిప్రాయాన్ని వ్యక్తీకరించేలా ప్రోత్సహిస్తాం. ఇది వ్యాసానికి బలాన్ని ఇస్తుంది. ఈ విధంగా మౌలికత, వైవిధ్యం, విమర్శనాత్మక దృష్టి ఈ మూడు అంశాలను కాపాడటం ద్వారా పుస్తకానికి ప్రత్యేకతను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. సారాంశంగా చెప్పాలంటే, మౌలిక భావనలు ఉన్నప్పుడు మాత్రమే సంకలనం ఒక సాధారణ గ్రంథంగా కాకుండా, విలువైన సాహిత్య సంపదగా మారుతుంది.

**నినాదం: ఈ పుస్తకాలు అందరికీ అందుబాటులో ఉంటాయా?**

ఈ పుస్తకాలను కేవలం రచయితలు లేదా పరిశోధకులకే పరిమితం చేయాలనే ఉద్దేశ్యం మా వద్ద లేదు. సాహిత్యం సమాజంలోని ప్రతి వర్గానికీ చేరాలనే భావంతో, ఈ గ్రంథాలను అందరికీ అందుబాటులో ఉండేలా రూపొందిస్తున్నాం. ముఖ్యంగా, విద్యార్థులకు ఇవి సులభంగా అర్థమయ్యేలా, పాఠ్యాంశాలకు అనుసంధానంగా ఉండే విధంగా రూపొందిస్తున్నాం. అలాగే పరిశోధకులకు అవసరమైన రిఫరెన్స్ విలువ ఉండేలా, సమగ్ర సమాచారం మరియు విశ్లేషణను అందిస్తున్నాం. ఇదే సమయంలో, సాధారణ పాఠకులు కూడా సులభంగా చదవగలిగేలా భాషను సరళంగా ఉంచుతున్నాం.ఇది కేవలం ఒక అకాడమిక్ ప్రయత్నం మాత్రమే కాదు; సమాజంలో అవగాహన పెంచే ఒక సాహిత్య ప్రయాణం. అందుకే పుస్తకాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి మేము ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం. సారాంశంగా చెప్పాలంటే, ఈ గ్రంథాలు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, జ్ఞానం కోరుకునే ప్రతి పాఠకుడికి అందుబాటులో ఉండేలా రూపొందించబడుతున్నాయి.

**నినాదం: పాఠకులు కొనాలంటే ఏం చేయాలి?**


ఈ పుస్తకాలను పాఠకులకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడం మా ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. అందుకే కొనుగోలు ప్రక్రియను సులభంగా, విస్తృతంగా ఉండేలా ప్రణాళిక చేస్తున్నాం. ముఖ్యంగా, పుస్తకాలను Amazon, Flipkartవంటి ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. దీంతో దేశంలో ఎక్కడ ఉన్న పాఠకుడైనా సులభంగా ఆన్‌లైన్ ద్వారా పుస్తకాలను ఆర్డర్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇదికాకుండా, నేరుగా సంపాదకులను లేదా ప్రచురణ బృందాన్ని సంప్రదించి కూడా పుస్తకాలను పొందే విధానాన్ని కల్పిస్తున్నాం. ఇది ముఖ్యంగా స్థానిక పాఠకులకు, సాహిత్య వర్గాలకు మరింత సౌకర్యంగా ఉంటుంది. భవిష్యత్తులో, పుస్తక ప్రదర్శనలు, సాహిత్య సభలు, విద్యాసంస్థల ద్వారా కూడా ఈ గ్రంథాలను పాఠకులకు చేరవేయాలనే ఉద్దేశ్యం ఉంది. సారాంశంగా చెప్పాలంటే, ఆన్‌లైన్, నేరుగా ఈ రెండు మార్గాల ద్వారా పుస్తకాలను ప్రతి పాఠకుడికి సులభంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

**నినాదం: విద్యావేత్తలు, సాహితీవేత్తల స్పందన?**

ఈ గ్రంథాలకు విద్యావేత్తలు, సాహితీవేత్తల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా బహుజన, జానపద సాహిత్య అంశాలను సమగ్రంగా తీసుకురావడం ఒక అవసరమైన ప్రయత్నమని వారు అభిప్రాయపడుతున్నారు. వారి నుంచి మాకు ప్రధానంగా ప్రోత్సాహం లభిస్తోంది. ఇలాంటి సంకలనాలు సమాజంలో చైతన్యం కలిగిస్తాయని, కొత్త తరానికి మార్గనిర్దేశం చేస్తాయని వారు ప్రోత్సహిస్తున్నారు. ఇది మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. అలాగే, వారు ఇచ్చే సూచనలు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. పుస్తకాల నిర్మాణం, అంశాల ఎంపిక, విశ్లేషణలో మెరుగులు ఎలా చేర్చాలి అనే విషయాల్లో తమ అనుభవాన్ని పంచుకుంటున్నారు. ఈ సూచనలు భవిష్యత్తు ప్రచురణలను మరింత నాణ్యంగా తీర్చిదిద్దడానికి సహాయపడుతున్నాయి. ఇవి మాత్రమే కాకుండా, ఈ ప్రయత్నాన్ని గుర్తించి పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా బహుజన దృక్పథాన్ని సాహిత్యంలో బలంగా ప్రతిష్ఠించడానికి తీసుకున్న ఈ చర్యను వారు ప్రశంసిస్తున్నారు. సారాంశంగా చెప్పాలంటే, విద్యావేత్తలు, సాహితీవేత్తల నుంచి లభిస్తున్న ప్రోత్సాహం, సూచనలు, అభినందనలు మా ప్రయత్నానికి బలం ఇచ్చే ప్రధాన ఆధారం.

**నినాదం: పత్రికలు, సోషల్ మీడియా పాత్ర?**

ప్రస్తుత కాలంలో పత్రికలు మరియు సోషల్ మీడియా సాహిత్య ప్రచారం, విస్తరణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక పుస్తకం పాఠకులకు చేరుకోవడంలో ఇవి ప్రధాన వేదికలుగా మారాయి. మొదటిగా, పత్రికలు సాహిత్యానికి ఒక సంప్రదాయ వేదికగా పనిచేస్తాయి. కొత్త పుస్తకాల పరిచయాలు, సమీక్షలు, రచయితల అభిప్రాయాలను ప్రచురించడం ద్వారా అవి పాఠకుల్లో ఆసక్తిని పెంచుతాయి. ముఖ్యంగా సాహిత్య వర్గాల్లో ఒక గ్రంథానికి గుర్తింపు రావడంలో పత్రికల పాత్ర చాలా ముఖ్యమైనది. ఇక సోషల్ మీడియా విషయానికి వస్తే, ఇది మరింత వేగంగా మరియు విస్తృతంగా పనిచేస్తోంది. పుస్తకాల గురించి సమాచారం వెంటనే వేలమంది పాఠకులకు చేరుతుంది. దీనివల్ల: పుస్తకాల ప్రచారం వేగంగా జరుగుతుంది కొత్త రచయితలు, పాఠకులు ఒకే వేదికపై కలుస్తారు. పుస్తకాలపై చర్చలు, సమీక్షలు పెరుగుతాయి అదనంగా, సోషల్ మీడియా ఒక పరస్పర వేదికగా ఉండటం వల్ల పాఠకుల అభిప్రాయాలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇది భవిష్యత్తు ప్రచురణలకు దిశానిర్దేశం చేస్తుంది. సారాంశంగా చెప్పాలంటే, పత్రికలు సాహిత్యానికి సంప్రదాయ బలం అయితే, సోషల్ మీడియా దానికి ఆధునిక విస్తరణ. ఈ రెండూ కలిసి పుస్తకాలను సమాజానికి దగ్గర చేస్తాయి.



డా. రామారావు గంజికుంట్ల — డా. ఇడికోజు శ్రీనివాసాచారి

**నినాదం: ప్రచురణలపై ఒత్తిడులు ఎదురయ్యాయా?**

ప్రచురణల ప్రక్రియలో ఒత్తిడులు లేకుండా ఉండడం సాధ్యం కాదు. ముఖ్యంగా స్వతంత్రంగా సంకలన గ్రంథాలను తీసుకురావడంలో అనేక సవాళ్లు ఎదురవుతాయి. వాటిలో ప్రధానంగా ఆర్థిక సమస్యలు ఒకటి. పుస్తక ముద్రణ, రూపకల్పన, పంపిణీ వంటి అంశాలకు ఖర్చు ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు సరైన ఆర్థిక వనరులు లేకపోయినా, సాహిత్యంపై ఉన్న నిబద్ధతతో ముందుకు సాగాల్సి వస్తుంది. అలాగే సమయ ఒత్తిడి కూడా ఒక పెద్ద సవాల్. రచయితల నుంచి వ్యాసాలను సేకరించడం, వాటిని సవరించడం, ముద్రణకు సిద్ధం చేయడం ఒక నిర్దిష్ట గడువులో పూర్తి చేయాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఆలస్యాలు జరిగినప్పుడు మొత్తం ప్రణాళికపై ప్రభావం పడుతుంది. ఇవి కాకుండా, కొన్ని సందర్భాల్లో అభిప్రాయ భేదాలు, నాణ్యత ప్రమాణాలపై చర్చలు కూడా ఎదురవుతాయి. అయితే ఈ అన్ని ఒత్తిడుల మధ్య కూడా మేము ముఖ్యంగా స్వతంత్రతను కాపాడుకోవడంపై దృష్టి పెడుతున్నాం. సాహిత్య విలువలు, నాణ్యత ప్రమాణాలు ఏ పరిస్థితిలోనూ రాజీ పడకుండా ముందుకు సాగడం మా ప్రధాన లక్ష్యం.సారాంశంగా చెప్పాలంటే, ఒత్తిడులు ఉన్నప్పటికీ, అవే మాకు అనుభవాన్ని ఇచ్చి, స్వతంత్రతను మరింత బలంగా నిలబెట్టేలా చేస్తున్నాయి.

**నినాదం: హక్కులు ఇవ్వాలనుకుంటున్నారా?**

భవిష్యత్తులో మా ప్రచురణలను విస్తరించడానికి, ఇతరులకు అవకాశాలు కల్పించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అయితే హక్కులను ఇవ్వడం అనేది కేవలం ఒక పరిపాలనా నిర్ణయం కాదు; అది సాహిత్య విలువలతో సంబంధం ఉన్న విషయం. ముఖ్యంగా, నాణ్యతను కాపాడే షరతులతోనే హక్కులు ఇవ్వాలని భావిస్తున్నాం. పుస్తకాల మూల ఉద్దేశ్యం, దృక్పథం, సాహిత్య ప్రమాణాలు ఏ విధంగానూ దెబ్బతినకూడదు. అలాగే గ్రంథంలోని భావజాలం వక్రీకరించబడకుండా ఉండాలి. ఇదే సమయంలో, సాహిత్యాన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో సరైన వ్యక్తులు లేదా సంస్థలు ముందుకు వస్తే వారికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం. ఇది సాహిత్య వ్యాప్తికి దోహదపడుతుంది. సారాంశంగా చెప్పాలంటే, హక్కులు ఇవ్వడంలో మా దృష్టి స్వేచ్ఛపై మాత్రమే కాకుండా, నాణ్యత మరియు సాహిత్య విలువల పరిరక్షణపై కూడా ఉంటుంది.

**నినాదం: డిజిటల్ ఎడిషన్ గురించి?**

ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తకాలను కేవలం ముద్రిత రూపంలో మాత్రమే పరిమితం చేయడం సరిపోదు. పాఠకుల అవసరాలు, చదివే అలవాట్లు మారుతున్న నేపథ్యంలో డిజిటల్ ఎడిషన్‌ల ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో మా పుస్తకాలను eBooks, PDFs, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక చేస్తున్నాం. దీని వల్ల ఎక్కడ ఉన్న పాఠకుడైనా సులభంగా పుస్తకాలను పొందగలుగుతాడు విద్యార్థులు, పరిశోధకులు తక్షణమే రిఫరెన్స్‌గా ఉపయోగించుకోగలుగుతారు. పుస్తకాల వ్యాప్తి విస్తృతంగా పెరుగుతుంది. అదనంగా, డిజిటల్ రూపంలో పుస్తకాలను అందించడం ద్వారా భద్రత, నిల్వ, పంచుకునే సౌలభ్యం కూడా పెరుగుతుంది. భవిష్యత్తులో ఆడియోబుక్స్, ఆన్‌లైన్ కోర్సులు వంటి కొత్త రూపాల్లో కూడా విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నాం. సారాంశంగా చెప్పాలంటే, ముద్రిత పుస్తకాలతో పాటు డిజిటల్ రూపంలో కూడా జ్ఞానాన్ని విస్తరించడం ఇదే మా భవిష్యత్తు దిశ.